జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php




సంపుటి 4 సంచిక 287 | హైదరాబాద్, ఆగష్టు 07 శనివారం 2021 | 8 పేజీలు | వెల : 5.00

## రాజీవ్‌గాంధీ ఖేల్ రత్న అవార్డు ఇక..
# మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న

### పేరు మారుస్తూ మోదీ సర్కారు నిర్ణయం
### టోక్యో ఒలింపిక్స్‌లో భారత్‌కు మరికొన్ని పతకాలపై ఆశలు
### గోల్ఫ్‌లో అదితికి రజతం ఖాయం..! జావెలిన్ త్రోలో నీరజ్‌కు చాన్స్
### రెజ్లింగ్‌లో బజరంగ్ కాంస్య పోరు నేడు
### సెమీస్‌లో పోరాడి ఓడిన మహిళల హాకీ జట్టు.. మోదీ ఓదార్పు



న్యూఢిల్లీ, ఆగష్టు 06, ప్రజాపాలన ప్రతినిధి: దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన 'రాజీవ్ గాంధీ ఖేల్ రత్న' పేరును.. మూడుసార్లు ఒలింపిక్ బంగారు పతకాన్ని సాధించిన హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ పేరిట 'మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న' అవార్డుగా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ట్విటర్ ద్వారా ప్రకటించారు. "మేజర్ ధ్యాన్‌చంద్ భారతదేశంలోని అగ్రశ్రేణి క్రీడాకారుల్లో ఒకరు. భారతదేశానికి గౌరవాన్ని తీసుకొచ్చి గర్వకారణమైన వ్యక్తి. మనదేశ అత్యున్నత క్రీడా పురస్కారానికి ఆయన పేరు పెట్టడం సముచితం" అని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఖేల్ రత్న పురస్కారానికి ధ్యాన్‌చంద్ పేరు పెట్టాలంటూ దేశవ్యాప్తంగా ప్రజల నుంచి తనకు ఎన్నో విజ్ఞప్తులు వచ్చాయని.. వారి మనోభావాలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని మోదీ వెల్లడించారు. ఒలింపిక్స్‌లో 41 సంవత్సరాల ఎదురుచూపుల అనంతరం పురుషుల హాకీ టీమ్ పతకాన్ని తెచ్చిన మర్నాడే కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. కాగా.. మోదీ సర్కారు నిర్ణయాన్ని కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ ఎంపీ, ప్రముఖ క్రికెటర్ గౌతమ్ గంభీర్ సహా పలువురు రాజకీయ, క్రీడా ప్రముఖులు స్వాగతించారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు చెబుతూనే.. మోదీ తన హ్రస్వదృష్టి రాజకీయాల కోసం మేజర్ ధ్యాన్‌చంద్‌లాంటి దిగ్గజ క్రీడాకారుడి పేరును దీంట్లోకి లాగకుండా ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించింది. ఇదే కోవలో ప్రధానమంత్రి తన పేరిట, అరుణ్ జైట్లీ పేరిట దేశంలో ఉన్న క్రీడామైదానాల పేర్లను కూడా .. క్రీడా దిగ్గజాలైన సచిన్ టెండూల్కర్, కపిల్‌దేవ్, మిలా?సింగ్, పీటీ ఉష తదితరుల పేర్లతో మారుస్తారని ఆశిస్తున్నట్టు ఆ పార్టీ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సూర్జేవాలా పేర్కొన్నారు. ఒలింపిక్ క్రీడలు జరిగే సంవత్సరంలో.. బడ్జెట్‌లో క్రీడలకు కేటాయించే మొత్తాన్ని 230 కోట్లకు తగ్గించిన మోదీ.. పెగాసస్, ద్రవ్యోల్బణం, సాగుచట్టాల వంటి కీలక అంశాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని ధ్వజమెత్తారు. రాజీవ్ ఖేల్ రత్న పేరు మార్చడం మోదీ సంకుచిత బుద్ధికి నిదర్శనమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. ఖేల్ రత్న పురస్కారం పేరు మారడాన్ని దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. రాజీవ్ ఖేల్‌రత్న పేరు మార్చిన ప్రధాని.. అహ్మదాబాద్‌లో

(మిగతా 2లో..)

## రైతాంగం ప్రయోజనాల విషయంలో...
# వెనకడుగు వేసే ప్రసక్తే లేదు

- 9న కృష్ణా, గోదావరి బోర్డుల సమావేశంలో అంశాలన్నీ లేవనెత్తాలి
- సమీక్షలో సీఎం కేసీఆర్, 8న మళ్లీ భేటీ
- ప్లీజ్.. సమావేశానికి రండి!
- తెలంగాణకు జీఆర్‌ఎంబీ వినతి
- గెజిట్ జారీ చేసి నెల అవుతోంది
- ఈఎన్‌సీకి సభ్య కార్యదర్శి పాండే లేఖ



హైదరాబాద్, ఆగష్టు 06, ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్ర సాగునీటి హక్కులను, రైతాంగం దీర్ఘకాలిక ప్రయోజనాలను కాపాడుకునే విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. దీనికోసం ప్రభుత్వ యంత్రాంగం పట్టుదలతో కృషి చేయాలన్నారు. కృష్ణా, గోదావరి బోర్డుల పరిధిలోకి ప్రాజెక్టులను తీసుకెళ్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసిన నేపథ్యంలో ఈనెల 9న జరిగే బోర్డుల సంయుక్త సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహంపై ప్రగతి భవన్‌లో శుక్రవారం సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. బోర్డుల సమావేశాల్లో తెలంగాణ వాణిని గట్టిగా వినిపించాలని ఉన్నతాధికారులకు సీఎం ఆదేశించారు. నీటివాటాలకు సంబంధించి బచావత్ ట్రెబ్యునల్ ఇచ్చిన తీర్పు ప్రకారం న్యాయమైన వాటాను దక్కించుకోవడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని నిర్దేశించారు. ఈసందర్భంగా కేంద్రం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లోని అంశాలను సీఎం క్షుణ్నంగా సమీక్షించారు. గోదావరి, కృష్ణా జలాల్లో ఉభయ రాష్ట్రాలకు ఉండే నీటివాటాల గురించి ఈ సమావేశంలో చర్చించారు.

(మిగతా 2లో..)

# బడి గంట మోగేదెప్పుడు?

### స్కూళ్లు ప్రారంభించుకోవచ్చన్న ఐసీఎంఆర్, ఎయిమ్స్ డైరెక్టర్
### ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ప్రారంభం.. మరికొన్ని రాష్ట్రాల్లో ఈనెల్లోనే
### రాష్ట్రంలో థియేటర్లు కూడా ఓపెన్.. స్కూళ్ల అంశమే సందిగ్ధం
### ప్రత్యక్ష తరగతులకు ప్రముఖ ఉపాధ్యాయ సంఘాల సుముఖత
### అధికారుల్లో అయోమయం.. నిర్ణయం ప్రభుత్వానిదేనని స్పష్టీకరణ
### మూడో వేవ్ అంచనాలతో ఏ నిర్ణయానికీ రాలేకపోతున్న సర్కారు



హైదరాబాద్, ఆగస్టు 6: ప్రత్యక్ష తరగతులను ప్రారంభించుకోవచ్చని ఐసీఎంఆర్‌తో పాటు ఎయిమ్స్ డైరెక్టర్ గులేరియా స్పష్టం చేశారు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులకు టీకాలు అక్కర్లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజాగా గురువారం ప్రకటించింది. ఉత్తరప్రదేశ్, ఛత్తీసగఢ్, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో స్కూళ్లను ఇప్పటికే ప్రారంభించారు. ఈనెల్లోనే స్కూళ్లను ప్రారంభించడానికి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, రాజస్థాన్ వంటి రాష్ట్రాలు షెడ్యూల్‌ను ప్రకటించాయి. పాఠశాలలను తెరవడానికి రాష్ట్రంలోని ప్రముఖ ఉపాధ్యాయ సంఘాలన్నీ సుముఖత వ్యక్తం చేస్తున్నాయి! అదే సమయంలో, ఇప్పటికే మూడో వేవ్ ప్రారంభమైందని, అక్టోబరు వరకూ ఇది కొనసాగుతుందనే అంచనాలూ వెలువడ్డాయి. ఈ నేపథ్యంలోనే, రాష్ట్రంలో పాఠశాలల ప్రారంభంపై ఉత్కంఠ నెలకొంది. ప్రత్యక్ష తరగతుల నిర్వహణపై ప్రభుత్వమూ సందిగ్ధ పరిస్థితిని ఎదుర్కొంటోంది. నిజానికి, దాదాపు ఏడాదిన్నరగా విద్యార్థులు స్కూళ్లు, కాలేజీలకు దూరమయ్యారు. రెండు విద్యా సంవత్సరాల్లో పరీక్షల్లేకుండానే విద్యార్థులను పాస్ చేశారు. ఈ పరిణామం ఇప్పటికే విద్యార్థుల ఆలోచన తీరుపై తీవ్ర ప్రభావం చూపుతోందని నిపుణులు చెబుతున్నారు. ఇటు విద్యార్థులు, అటు పాఠశాలల భవితవ్యం కోసం స్కూళ్లను తెరవాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి, జూలై ఒకటో తేదీ నుంచి రాష్ట్రంలో డిజిటల్ (టీవీ) క్లాసులను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఆగస్టు నుంచి కొత్త సిలబస్ ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, టీవీ క్లాసులతో విద్యార్థులకు పెద్దగా ప్రయోజనం కలగడం

> **ఏడాదిన్నరగా విద్యార్థులు స్కూళ్లు, కాలేజీలకు దూరమయ్యారు. రెండు విద్యా సంవత్సరాల్లో పరీక్షల్లేకుండానే విద్యార్థులను పాస్ చేశారు. ఈ పరిణామం ఇప్పటికే విద్యార్థుల ఆలోచన తీరుపై తీవ్ర ప్రభావం చూపుతోందని నిపుణులు చెబుతున్నారు. వారి భవిష్యత్తుపైనా తీవ్ర ప్రభావం చూపనుందని అంటున్నారు.**

లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రత్యక్ష తరగతులు ప్రారంభించడమే మంచిదన్న వాదన మొదలైంది. ప్రభుత్వం కూడా కొవిడ్ తీవ్రత తగ్గిన తర్వాత ప్రత్యక్ష తరగతులను ప్రారంభిస్తామని తెలిపింది.

**ప్రస్తుతం రాష్ట్రంలో..**

ప్రస్తుతం రాష్ట్రంలో కొవిడ్ తీవ్రత ఏమీ లేదు. థియేటర్లు సహా అన్నీ తెరుచుకున్నాయి. జన జీవనం సాధారణ స్థాయికి చేరుకుంది. ఈ నేపథ్యంలో, దశలవారీగా తరగతులను ప్రారంభించాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉదాహరణకు, ముందుగా 9, 10 తరగతులను ప్రారంభించి, వీటిలో కూడా ఒకరోజు ఒక తరగతి మరో రోజు మరో తరగతి పద్ధతిలో

(మిగతా 2లో..)



## ప్రొఫెసర్ జయశంకర్ సార్ కి ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్చెరు, ఆగష్టు 06, (ప్రజాపాలన ప్రతినిధి:తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా పటాన్చెరు పట్టణంలోని ఆయన విగ్రహానికి పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ తొలి, మలి విడత తెలంగాణ ఉద్యమాలకు ప్రొఫెసర్ జయశంకర్ దిక్సూచిగా ఉన్నారని,తెలంగాణ ఉద్యమానికి ఆయన జీవితాన్ని అంకితం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, పార్టీ సీనియర్ నాయకులు విజయ్ కుమార్, బసవేశ్వర్, పాండు, అశోక్, షకీల్, శేకర్, శంకర్, అజ్మత్, తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెలకు మేకలకు ఉచిత నట్టల నివారణ మందు: పశువైద్యాధికారి డాక్టర్ శ్రీ ప్రియ



వెల్గటూర్, ఆగస్ట్ 06 (ప్రజాపాలన ప్రతినిధి) : వెల్గటూర్ మండలం స్తంభంపల్లి, కుమ్మరి పల్లి, వెంకటాపూర్ గ్రామాలలో శుక్రవారం రోజు1701 మేకలకు, గొర్రెలకు ఉచిత నట్టల నివారణ మందు పంపిణీ చేసినట్లు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. స్తంభంపల్లి గొర్రెలు 1022, మేకలు 135 అలాగే కుమ్మరి పల్లి గొర్రెలు 400, మేకలు 80, వెంకటాపూర్ గొర్రెలు 550,మేకలు 100 ఈ మూడు గ్రామాలలో మొత్తం మేకలు గొర్రెలకు పంపిణీ ఉచిత నట్టల నివారణ మందు పంపిణీ జరిగిందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్తంభంపల్లి ఎం.పి.టి.సి పొడిచేటి సతీష్, కుమ్మర పల్లి సర్పంచ్ కొప్పుల విద్యాసాగర్, ఉపసర్పంచ్ మాచర్ల తిరుపతి, వెంకటాపూర్ సర్పంచ్ రాందేవ్ ని రమా కోటయ్య, వెల్గటూర్ మండల శాఖ తె.రా.స అధ్యక్షులు చల్లూరి రామచంద్ర గౌడ్, మండల పశు వైద్య సిబ్బంది వల్లిగత్తుల పోచయ్య, బీ. మాధవి, ఆకుల నాగరాజు,ఆఫీస్ సబార్డినేట్ కుమార్, గొర్రెల, మేకల కాపరులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాల వారోత్సవాలు



ఇబ్రహీంపట్నం, ఆగస్టు 06 (ప్రజాపాలన ప్రతినిధి): మండలం లోనీ గోదుర్ గ్రామంలో అంగన్వాడి కేంద్రలలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు ఈసందర్భంగా బాలింతలకు తల్లిపాల విప్షితను గురించి వివరించారు,అమ్మపాలు బిడ్డకు రక్ష, తల్లికి శ్రీ రామ రక్ష అని,తల్లి పాలని మించిన ఔషధం లేదని అటువంటి అమ్మ పాల వారోత్సవాలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్ని అంగన్వాడీ టిచర్ లు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో గ్రామసర్పంచ్ సోమ ప్రభాకర్,అంగన్వాడీ టిచర్ లు నీలిమ,విజయలక్ష్మి, భాగ్యవతి,ఈశ్వరి,ఎఎన్ఎం పద్మ,అయాలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



వలిగొండ ప్రజా పాలన ప్రతినిధి మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా ప్రభుత్వ కార్యాలయాల్లో మరియు శాఖ గ్రంథాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం మండల అధ్యక్షులు సాయిని యాదగిరి, గ్రంథాలయ ఇన్చార్జ్ ఆంజనేయులు,నాన చెర్ల రమేష్,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీ లక్ష్మారెడ్డి,అంగన్వాడి ఉపాధ్యాయులు పంజాల పద్మ,సుమలత,వెంకటేష్ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## బోడుప్పల్లో ఘనంగా జయశంకర్ జయంతి వేడుకలు



మేడిపల్లి, ఆగస్టు6 (ప్రజాపాలన ప్రతినిధి) తెలంగాణ సిద్ధాంత కర్త ,ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని పురస్కరించుకుని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి ఆద్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవి గౌడ్ పాల్గొని జయశంకర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఆనంతరం మేయర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం సమయంలో కొత్తపల్లి జయశంకర్ పాత్ర మరువలేనిది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు దొంతరబోయిన మహేశ్వరి, కొత్త శ్రీ విద్య, కో-ఆప్షన్ సభ్యులు బండారు దత్తాత్రేయ శాస్రి,టీఆర్ఎస్ సీనియర్ నాయకులు మీసాల క్రిష్ణ,కాటపల్లి రాంచంద్రారెడ్డి, జక్క రాములు,కొత్త చక్రపాణి గౌడ్, దోంతరబోయిన కృపాసాగర్ ముదిరాజ్, మీసాల గిరి, బందారం శ్రీధర్ గౌడ్, పి.వి సురేష్, యమ్.ప్రభాకర్ రెడ్డి, యువజన విభాగం నాయకులు ఉప్పరి విజయ్, పూలకండ్ల కీర్తన్ రెడ్డి, మోతె రాజు, బాబా, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ కు ఎంపికైన మాటూరు విద్యార్థినులు నిర్విరామ కృషి చేసిన మాటూరు హిందీపండిట్ చాంద్ బేగం



మధిర ఆగష్టు 06, ప్రజాపాలన ప్రతినిధి: మధిర మండలంలోని మాటూర్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ నందు వివిధ కేటగిరీలలో నమోదయ్యారని తెలుగు బుక్ అఫ్ రికార్డ్స్ నిర్వాహకులు శ్రీ చింతలపాటి వెంకటాచారిఒక ప్రకటనలో తెలిపారు. మ్యాథమెటికల్ 28 టేబుల్స్ రివర్స్ రైటింగ్ విభాగంలో మేడిశెట్టి నందిని, వివిధ భాషల అక్షరమాల అనే విభాగంలో చీళ్ల త్రివేణి, వివిధ భాషల జాతీయగీతం అనే విభాగంలో తోట ప్రతీష, ఇండియా మ్యాప్ లో 29 రాష్ట్రాలను డ్రాచేసి రాష్ట్రాల పేర్లను గుర్తించే విభాగంలో మేడిశెట్టి వెంకట లక్ష్మి లహరిలి అనే నలుగురు మాటూర్ హైస్కూల్ కు చెందిన విద్యార్థినులు ఒకేసారి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు దక్కించుకోవడం అత్యంత అద్భుతమైన ఘనతగా పేర్కొంటూ వీరిని తీర్చి దిద్దిన లిమహ్మద్ చాంద్ బేగంలి సేవలను కొనియాడారు. గతంలో కందుల సిద్దార్థ ఎంపికలో కృషి చేసిన దానికంటే అధికంగా శ్రమించి విద్యార్థినులను శిక్షణ ఇచ్చిన చాంద్ బేగంకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ దీవి సాయికృష్ణమాచార్యులు ప్రత్యేక అభినందనలు తెలియజేసారుఈ సందర్భంగా శిక్షకురాలు చాంద్ బేగం మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయులందరి సహకారం తోనే ఈ రికార్డు సాధించటం జరిగిందని తెలుపుతూ కృతజ్ఞతలు తెలిపార ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సంక్రాంతి శ్రీనివాసరావు, కొలగాని ప్రసాదరావు, మేడేపల్లి శ్రీనివాసరావు, కంచిపోగు ఆదాము, రెంటపల్లి భాగ్య శ్రీనివాసరావు, వేము రాములు, గుంటుపల్లి రమాదేవి, వేములపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ జాతిపిత ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా మొక్కలు నాటిన నాయకులు



జిన్నారం, ఆగష్టు 06, ప్రజాపాలన ప్రతినిధి:జిన్నారం మండలంలోని సోలక్పల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఎంపీపీ రవీందర్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి స్థానిక సర్పంచ్ దాసరి శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో వార్డు సభ్యుడు కొత్త కాపు జగన్ రెడ్డి వంద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగన్ రెడ్డి నీ అభినందించారు. అలాగే తెలంగాణ జాతిపిత తొలి దశ ఉద్యమం నుంచి మలిదశ ఉద్యమం వరకు తెలంగాణ కోసమే ధ్యాస శ్వాసగా తన జీవితాన్ని అర్పించిన ప్రొఫెసర్ జయ శంకర్ ను ఎప్పటికీ మార్వాలేమని, తాను చేసిన త్యాగఫలమే తెలంగాణ రాష్ట్ర అవిర్భావం అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగు రమేష్, నాయకులు వడ్డే కృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణారెడ్డి, నరేందర్ రెడ్డి , సాజీత్, దేవేందర్ గౌడ్, పాండు, శ్రీరాములు, యనగండ్ల నరేందర్, సుమన్ రెడ్డి, శేఖర్, నగేష్ గౌడ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## సోలక్పల్లి లో ఘనంగా బోనాల పండుగ

**-ఉత్సవాలకు హాజరైన కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్**



జిన్నారం ఆగష్టు 06, ప్రజాపాలన ప్రతినిధి:మండలం సోలక్పల్లి గ్రామంలో గురువారం గ్రామస్తులు బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. బోనాల వేడుక సందర్భంగా గ్రామస్తులు తొట్టెల ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఊరు వాడా చల్లగా చూడాలని అమ్మవారిని కోరినట్లు తెలిపారు. గ్రామస్తులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, వైస్ ఎంపీపీ రంగు రమేష్, కాంగ్రెస్ నాయకులు అనిల్ కుమార్ రెడ్డి, వడ్డే కృష్ణ, భాస్కర్ రెడ్డి, జగన్ రెడ్డి, కృష్ణారెడ్డి, నారా గౌడ్, ప్రమోద్ రెడ్డి, గ్రామస్తులు మల్లేష్, శ్రీనివాస్ రెడ్డి, నాగేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ అద్వర్యం లో తల్లిపాల వారోత్సవాలు



కొడిమ్యాల ఆగస్టు 06. (ప్రజా పాలన ప్రతినిధి):కొడిమ్యాల మండలం పూడర్ గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొడిమ్యాల మండల అధ్యక్షులు బండ లింగారెడ్డి చేతులమీదుగా ఇందిరా నగర్ కాలనీలోని అంగన్వాడి సెంటర్ లో తల్లిపాలవారోత్సవాల కార్యక్రమం లో భాగంగా గర్భిణీ స్త్రీలకు పళ్ళు పంపిణి చేయడం జరిగింది, ఈకార్యక్రమంలోకార్యదర్శి వడ్లూరి సంతోష్ కుమార్ సింగిల్విండో చేర్మెన్ బండ రవీందర్ రెడ్డి నాగభూషణ్ రెడ్డి, గోపాల్ రెడ్డి, మార్క మనోహర్, రమేష్ వార్డు మెంబర్ అబ్రామ్, అంగన్వాడీ సూపర్ వైజర్ శ్రీలత,అంగన్వాడీ టీచర్లు,గర్భిణీ స్త్రీలు మహిళలు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ జయంతి



కొడిమ్యాల ఆగస్టు 06 (ప్రజా పాలన ప్రతినిధి): కొడిమ్యాల మండల పరిషత్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి కార్యక్రమం నిర్వహించబడినది ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులు కొడిమ్యాల సింగిల్విండో చైర్మన్ మేనేని రాజనర్సింగ రావు, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పునుగోటి కృష్ణ రావు, వైస్ ఎంపీపీ పర్లపల్లి ప్రసాద్, ఎంపీటీసీ మల్లారెడ్డి తిరుమలాపూర్ సింగిల్విండో చైర్మన్ పోల్ రాజేందర్ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు అంకం రాజేశం ఎంపీడీవో పద్మజ ఏ ఈ చంద్రశేఖర్ టైపిస్టు అరుణ్ టిఆర్ఎస్ పార్టీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు నేరళ్ల మహేష్ నాయకులు గుంటి తిరుపతి అజయ్ రెడ్డి కత్తి నరేష్ అయిత గణేష్ ఈదురు అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

## పీర్జాదిగూడలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



మేడిపల్లి, ఆగస్టు6 (ప్రజాపాలన ప్రతినిధి) తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాత, స్వరాష్ట్ర సాధన కోసం తపించిన తెలంగాణ సిద్ధాంత కర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయ ఆవరణలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కమీషనర్ ఎం. శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి వారి సేవలను, స్వరాష్ట్ర సాధనలో వారు చేసిన కృషిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కె. సుభాష్ నాయక్, బొడిగే స్వాతి, కొల్తూరు మహేష్, బచ్చ రాజు, మద్ది యుగేందర్ రెడ్డి, అమర్ సింగ్, తూముకుంట్ల ప్రసన్న లక్ష్మీ, కుర్ర షాలిని, అలువాల సరిత, కౌడే పోచయ్య, ఎంపల్ల అనంత్ రెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మున్సిపల్ డీఈ శ్రీనివాస్, మేనేజర్ జ్యోతి, టీఆర్ఎస్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, మడుగుల చంద్రా రెడ్డి, అలువాల దేవేందర్ గౌడ్, కుర్ర శ్రీకాంత్ గౌడ్, బండి సతీష్ గౌడ్, యాసారం మహేష్, పాశం బుచ్చి యాదవ్, చెరుకు పెంటయ్య గౌడ్, జావిద్ ఖాన్, మనోరంజన్ రెడ్డి, రఘువర్ధన్ రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బడి గంట మోగేదెప్పుడు?

(మొదటి పేజీ తరువాయి)

రోజు విడిచి రోజు క్లాసులను నిర్వహించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఇలా వారం రోజులపాటు పరిస్థితిని అంచనా వేసిన తర్వాత మరిన్ని తరగతులను ప్రారంభించవచ్చని సూచిస్తున్నారు. తాజాగా, ఇదే అంశంపై పాఠశాల విద్యా శాఖ అధికారులు కూడా దృష్టి పెట్టారు. కానీ, ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే ప్రతిపాదనలను సిద్ధం చేయాలని భావిస్తున్నారు. అంతే తప్పితే, పాఠశాలలను ప్రారంభించాలంటూ తమంతట తాము ప్రతిపాదనలు పంపబోమని పేరు రాయడానికి ఇష్టపడని అధికారి చెప్పారు. అంతేనా, ప్రారంభించడానికి వీలుగా స్కూళ్లను సన్నద్ధం చేసుకోవడానికి కనీసం 15 రోజులు అవసరం అవుతుంది. ఇక, పాఠశాలల విషయంలో నిర్ణయం తీసుకుంటే హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్ల విషయంలోనూ ఓ నిర్ణయానికి రావాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే, సెప్టెంబరు ఒకటి నుంచి తరగతులు ప్రారంభించాలన్నా ఇప్పటికిప్పుడు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఉపాధ్యాయులకు వ్యాక్సినేషన్ పూర్తి కావడంతో వారి నుంచి అభ్యంతరం వ్యక్తం కాకపోవచ్చని అంచనా వేస్తున్నారు.

**ఈసారైనా సరైన నిర్ణయం తీసుకోవాలి**

ఆగస్టు 15వ తేదీ తర్వాత పాఠశాలలను తెరిచే విషయంపై ప్రభుత్వం తగు నిర్ణ యం తీసుకోవాలి. కొవిడ్ నిబంధనలను అమలుపరుస్తూ స్కూళ్లను నిర్వహించాలి. గత ఏడాది కూడా విద్యార్థులకు సరైన విద్యా బోధన జరగలేదు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ ఏడాది ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలి.

**శ్రీపాల్ రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు**

**ప్రభుత్వ బడుల విద్యార్థులకు నష్టం**

ప్రత్యక్ష తరగతులను ప్రారంభించాలి. ప్రస్తుత టీవీ క్లాసులతో పెద్దగా ప్రయోజనం లేదు. ప్రైవేట్ స్కూళ్ల మాదిరిగా ఆన్లైన్ తరగతులను నిర్వహించడానికి ప్రభు త్వం వద్ద వ్యవస్థ లేదు. దాంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు నష్టపోతున్నారు.

**చావ రవి, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి**

**ముందుగా 9, 10 తరగతులు ప్రారంభించాలి**

ముందుగా 9, 10 తరగతులను ప్రా రంభించాలి. అనంతరం పరిస్థితిని అం చనా వేసి, మిగిలిన తరగతులను కూడా ప్రారంభించాలి. టీవీల ద్వారా బోధనతో విద్యార్థులకు ప్రయోజనం కలగడం లేదు. చాలామంది దీనికి దూరంగా ఉంటున్నారు. ప్రత్యక్ష తరగతులను ప్రారంభిస్తేనే కొంతన్యాయం జరగనుంది.

**సదానందం గౌడ్, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు**

**ప్రారంభిస్తేనే మనుగడ**

వీలైనంత త్వరగా పాఠశాలలను ప్రారంభించాలి. లేకపోతే, చిన్న చిన్న ప్రైవేట్ స్కూళ్లు శాశ్వతంగా మూతపడే ప్రమాదం ఉంది. ఈ విషయంపై ప్రభు త్వం సీరియస్గా ఆలోచించి త్వర గా ఒక నిర్ణయానికి రావాలి. ముఖ్యంగా, గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు చదు వు నేర్పించడంలో బడ్జెట్ స్కూళ్ల పాత్ర ఎక్కువగా ఉంటుంది. కరోనా కాలంలో ఇవన్నీ నష్టాన్ని చవిచూస్తున్నాయి.

**పాపిరెడ్డి, ప్రైవేట్ స్కూళ్ల సంఘం అధ్యక్షుడు**

## రైతాంగం ప్రయోజనాల విషయంలో... వెనకడుగు వేసే ప్రసక్తే లేదు

(మొదటి పేజీ తరువాయి)

ఈసందర్భంగా కృష్ణా, గోదావరి ప్రాజెక్టులను బోర్డులకు అప్పగిస్తే... ఎంత ఖర్చు అవుతుంది? ఎంతమందిఉద్యోగులను బోర్డుల కిందికి తేవాల్సి ఉంటుంది ? అనే అంశాలను సీఎంకు అధికారులు వివరించారు. కృష్ణా, గోదావరి బోర్డుల ఖాతాల్లో చెరో రూ.200 కోట్లను జమచేయాలంటూ తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన లేఖలపై నివేదించారు. కేంద్రం విడుదల చేసిన గెజిట్పై చర్చించడానికి ఈనెల 8న మరోమారు సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఉన్నతాధికారులు భేటీ కానున్నారు. సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ , సీఎంవో ముఖ్యకార్యదర్శి నర్సింగ రావు, నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్కుమార్, ఈఎన్సీలు సి.మురళీధర్రావు, హరిరామ్, సీఎం ఓఎస్డీ శ్రీధర్రావు దేశ్ పాండే,. మాజీ అడ్వకేట్ జనరల్ రామకృష్ణారెడ్డి, సీనియర్ అడ్వకేట్ రవీందర్రావు, ఇరిగేషన్ శాఖ అంతర్రాష్ట్ర విభాగం చీఫ్ ఇంజనీర్ మోహన్కుమార్, ఎస్ఈ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్గాంధీ ఖేల్ రత్న అవార్డు ఇక..మేజర్ ధ్యాన్చంద్ ఖేల్ రత్న

(మొదటి పేజీ తరువాయి)

మోదీ స్టేడియం పేరునూ మార్చి క్రీడాకారుడి పేరు పెట్టాలని కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. పలువురు నెటిజన్లు, విపక్ష నేతలు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూనే, క్రీడా మైదానాలకు రాజకీయ నాయకుల పేర్లు పెట్టడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అహ్మదాబాద్ లోని స్టేడియానికి మోదీ పేరును తీసేసి, ప్రముఖ క్రీడాకారుల్లో ఎవరో ఒకరి పేరు పెట్టాలని సోషల్ మీడియాలో డిమాండ్ చేశారు. “భవిష్యత్తులో కూడా క్రీడా మైదానాలకు కేవలం క్రీడాకారుల పేర్లే పెడతారని ఆశిస్తున్నాను” అని క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ ట్వీట్ చేయడం గమనార్హం.

**స్ఫూర్తినిచ్చారు.. భేష్**

కాంస్యపతకం కోసం జరిగిన పోరులో ఓటమి చెందినప్పటికీ.. మహిళా హాకీ టీమ్ తమ ఆట తీరుతో స్ఫూర్తినిచ్చిందని మోదీ కొనియాడారు. “మహిళల హాకీలో మనం త్రుటిలో పతకాన్ని చేజార్చుకున్నాం. కానీ, ఈ బృందం నవభారత స్ఫూర్తిని ప్రతిఫలింపజేసింది. ఒలింపిక్స్లో వారి ఆట తీరు దేశంలోని యువతులు హాకీని కెరీర్గా ఎంచుకుని, ఆ మార్గంలో ముందుకుపోవడానికి ప్రేరణగా నిలుస్తుంది” అని ప్రశంసించారు.

**మీరాబాయ్ చానుకు అండగా మోదీ: బీరేన్**

రజత పతకంతో టోక్యో ఒలింపిక్స్లో సత్తా చాటిన వెయిట్లిఫ్టర్ మీరాబాయ్ చానుకు, మరో అథ్లెట్కు ప్రధాని మోదీ సాయం చేశారని.. ఆ సాయం వల్లనే చాను ఆరోగ్యసమస్యల నుంచి బయటపడి పతకం సాధించిందని మణిపూర్ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ తెలిపారు.



## మధిర మున్సిపాలిటీ 1 వ వార్డులో డ్రై డే

మధిర, ఆగష్టు 06, ప్రజాపాలన ప్రతినిధి:మధిర మున్సిపాలిటీ చైర్మన్ లత మరియు కమిషనర్ రమాదేవి ఆదేశంతో వార్డు కౌన్సిలర్ పగిడిపల్లి విజయమ్మ ఆ ధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వే మరియు కోవిడ్ 19 వచ్చిన వారికి నిలవ నీటివల్ల సీజనల్ వ్యాధులు డెంగ్యూ మలేరియా వ్యాపించకుండా ఇంటి పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని చెప్పటం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ సువార్త,ఆశా వర్కర్ లక్ష్మిదేవి, భారతీ, వీన వార్డు ఇంచార్జ్ గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు

## జయశంకర్ సారు కు నివాళులర్పించిన జెడ్ పి టి సి నిత్య నిరంజన్ రెడ్డి



ఇబ్రహీంపట్నం ఆగష్టు 06, ప్రజాపాలన ప్రతినిధి:ఇబ్రహింపట్నం మంచాల మండల పరిధిలోని నిత్య నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ జయశంకర్ సార్ తెలంగాణ స్ఫూర్తి నందించిన సిద్ధాంతకర్త నాలుగు కోట్ల ప్రజల గొంతుకలో ఉద్యమ చైతన్యాన్ని నూరిపోసి రగిలించి తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి అందించిన ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్బంగా శుక్రవారం మంచాల మండల కార్యాలయం వద్ద జయంతి కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంచాల మండలం జెడ్పీటీసీ మర్రి నిత్య నిరంజన్ రెడ్డి , ఈ కార్యక్రమంలో ఎంపీపీ నర్మద,ఎంపీటీసీలు ఎడ్మ నరేందర్ రెడ్డి, పల్నాటి జయ నందం, లట్టుపల్లి చంద్రశేఖర్ రెడ్డి,వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక శాఖ మంత్రిని కలిసిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య



హైదరాబాద్ ఆగష్టు 06, ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిని కలిసిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య. శుక్రవారం నాడు ఉదయం తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావును హైదరాబాద్ అరణ్య భవన్ లోని మంత్రి కార్యాలయంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య. మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలియజేశారు.

## తెలంగాణ సాధన కోసం అహర్నిశలు పోరాడిన మహనీయుడు జయశంకర్

**విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**



వికారాబాద్ బ్యూరో 06 ఆగస్ట్ ప్రజాపాలన : నీళ్ళు, నిధులు, నియామకాల ఆవశ్యకత కోసం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ అని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కొనియాడారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ సాధన అనంతరం కొత్త జిల్లాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని గుర్తు చేశారు. కొత్త జిల్లాలో అధికారులు సిబ్బంది అందరు బంగారు తెలంగాణ కొరకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొత్త రాష్ట్రంలో ఏర్పడిన తరువాత త్రాగు నీరు, సాగు నీరుతో పాటు వివిధ రంగాలలో ఎంతో అభివృద్ధి సాధించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అందరు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలలో పలుపంచుకొని బంగారు తెలంగాణ సాధనకు తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ ఆనంద్, మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్ల పల్లి మంజుల రమేష్, పలువురు రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

## బీసీ కమ్యూనిటీ హాల్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్



పటాన్ చెరు, ఆగష్టు 06, ప్రజాపాలన ప్రతినిధి:పటాన్చెరు మండలం బానూరు గ్రామంలో సుమారు ఇరవై రెండున్నర లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన బీసీ కమ్యూనిటీ హాల్ ను శుక్రవారం స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుష్మశ్రీ వేణుగోపాల్ రెడ్డి, జడ్పిటిసి సుప్రజా వెంకట్ రెడ్డి, సర్పంచ్ శ్రీహరి, ఎంపీటీసీ యాదగిరి, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దశరథ రెడ్డి, వెంకటరెడ్డి, టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## మోచర్ల మరియన్న భౌతికకాయానికి నివాళులు అర్పించిన కాంగ్రెస్ పార్టీ మండల పట్టణ నాయకులు



మధిర, ఆగష్టు 06, ప్రజాపాలన ప్రతినిధి:కాంగ్రెస్ నాయకులు..మాజీ వార్డ్ మెంబర్ మోచర్ల సురేష్ గారి తండ్రి మోచర్ల మరియన్న అనారోగ్యంతో మృతిచెందారు.వారి భౌతికకాయాన్ని నివాళులు అర్పించి వారి కుటుంభ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేసిన కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ నాయకులుమధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లిమిర్యాల వెంకటరమణ గుప్తాలి మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లిరంగా హనుమంతరావుబ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు లిచావా వేణులి మధిర మండల ఎస్సీసెల్ అధ్యక్షులు లిదారా బాలరాజులి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు తూమాటి నవీన్ రెడ్డిమధిర అ మున్సిపాలిటీ కౌన్సిలర్ లిమునుగోటి వెంకటేశ్వరరావులి సర్పంచ్ లిపులి బండ్ల చిట్టిబాబులి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లిఅద్దంకిరవికుమారలి,మధిర పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు లిషేక్ జహంగీర్లి పట్టణ బిసి సెల్ అధ్యక్షులు లిబిట్ర ఉద్దండయ్యాలి మాజీ సర్పంచ్ లికర్నాటి రామారావులి ముస్లిం వెల్ఫేర్ కమిటీ అధ్యక్షులు లిషేక్ మహమ్మద్ అలీలి బండారి నరసింహారావు,లి చింతమాల శ్రీనివాస్లి లిఅదురీ శ్రీను లిఆదిమూలం శ్రీనివాసరావులి లియదాల బెనర్జీలి మొదలగు వారు నివాళులర్పించారు.

### సంపసాల గురుమూర్తి భౌతికకాయానికి నివాళులు అర్పించిన తెలుగుదేశం నాయకులు



మధిరఆగష్టు 06, ప్రజాపాలన ప్రతినిధి: సీనియర్ కాంగ్రెస్ నాయకులు మధిర మేజర్ గ్రామపంచయతి మాజీ వార్డ్ మెంబెర్ సంపసాల గురుమూర్తిగారు ఈరోజు ఉదయం 2.30 గంటల సమయంలో మధిరలోని యాదవులు బజారునందుగల వారి స్వగృహంలో మృతి చెందారు దివంగత సంపసాల గురుమూర్తి గారు 5దు సం వత్సరంలు వారిసతీమణి సంపసాల పుష్పావతిగారు 10ది సం వత్సరములు పంచాయతి మెంబెర్లుగా నీతి నిజాయితీతో మంచి విజ్ఞతతో కూడిన అవగాహనతో ప్రజల సమస్యల పరిష్కారం కొరకు ఎనలేని కృషి చేసి ప్రజల మన్ననలు పొందారని నాటి మధిర మేజర్ గ్రామ పంచాయతి మాజీ సర్పంచ్ , లితెలుగుదేశంపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం మధిర మున్సిపల్ కౌన్సిలర్ వంకాయలపాటి వెంకటనాగేశ్వరరావు, మాజీ మునిస్పల్ కౌన్సిలర్ గూడెల్లి నాగేశ్వరావు, మాజీ ఎంపిటిసి మారుత అప్పారావు, చిర్రా కృష్ణకాంత్ అంగ డాల వెంకట్రాయ్య గుమ్మా ప్రశాంత్ శ్రీను కొనియాడారు.

## మేకలకు గొర్రెలకు నట్టల మందు వేయించుకోవాలి

**పులుసుమామిడి సర్పంచ్ నారెగూడెం కమాల్ రెడ్డి**



వికారాబాద్ బ్యూరో 06 ఆగస్ట్ ప్రజాపాలన : పశు పోషణ ద్వారా ఆర్థికంగా ఎదగవచ్చని పులుసుమామిడి గ్రామ సర్పంచ్ నారెగూడెం కమాల్ రెడ్డి హితవు పలికారు. శుక్రవారం వికారాబాద్ మండల పరిధిలో గల పులుసుమామిడి గ్రామంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు, మేకలకు గొర్రెలకు నట్టల మందు వేసే కార్యక్రమాలను కార్యదర్శి రాములు, విఎల్ఓ సురేందర్ నాయక్ లతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. మా నీళ్ళు మా నిధులు మా నియామకాలు మాకే కావాలని ఆంధ్ర పాలకులతో వీరోచితంగా పోరాడిన మహనీయుడు జయశంకర్ సార్ అని కొనియాడారు. ఆయన అడుగు జాడల్లో నడవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని గుర్తు చేశారు. తాగు సాగు నీటికి ఏ ఇబ్బంది ఉండకూడదనే లక్ష్యమే స్వరాష్ట్ర సాధన అని వివరించారు. గ్రామంలో మేకలు గొర్రెలు కాసే యజమానులు తప్పకుండా నట్టల మందు వేయించాలని కోరారు. పశు సంపద ఎంత బాగుంటే ఆ గ్రామం ఆర్థికంగా ఎదుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఒకే ఇంట వికసించిన 36 బ్రహ్మకమలాలు



వికారాబాద్ బ్యూరో 06 ఆగస్ట్ ప్రజాపాలన : ఆది దేవుడైన భోళా శంకరునికి ప్రీతిపాత్రమైన బ్రహ్మకమలాలు విరగబూస్తున్నాయి. బ్రహ్మకమలం పూవుతో శివునికి పూజా కైంకర్యాలు నిర్వహిస్తే ఆ ఇంట అన్నీ శుభాలే కలుగుతాయని హిందువుల విశ్వాసం. అందుకే ప్రతి హిందూ కుటుంబం బ్రహ్మకమలాలు పెంచుకునేందుకు ఆరాటపడతారు. బ్రహ్మకమలాల మొక్కల ధరలు మొక్క యొక్క వయస్సును అనుసరించి ధరలు ఉంటాయని నర్సరీ పెంపకందారులు చెబుతున్నారు. ఆన్లైన్లో బ్రహ్మకమలం మొక్కల ధరలు కూడా ఆకాశం వైపు ఎగబాకుతున్నాయి. గురువారం రాత్రి వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 23వ వార్డులో మార్గం సంతోష్ కుమార్, మార్గం బృహక్ సాయి, మార్గం బృహతిల ఇంట ఒకే బ్రహ్మకమలం మొక్కకు 36 బ్రహ్మకమలాలు వికశించడంతో చుట్టుపక్కల జనం చూసి తరించారు. ఊరడి బాగయ్య, ఊరడి క్రిష్ణవేణి దంపతుల ఇంట వికశించిన బ్రహ్మకమలాలను చూడడానికి జనం ఆసక్తితో తరలివచ్చారు. రాత్రి పూట వికశించి ఉదయం కాగానే ముడుచుకుంటాయి. బ్రహ్మకమలాలను శివారయాలకు వెళ్ళి భక్తితో శివునికి అర్పించి కోరికలను నెరవేర్చమని వేడుకుంటారు.

### జయశంకర్ సార్ ఆశయ లను ముందుకు తీసుకెళ్దాం



ఇబ్రహీంపట్నం ఆగష్టు 06, ప్రజాపాలన ప్రతినిధి: ఇబ్రహీంపట్నం మంచాల మండలం కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయాల సాధనలోనే పటిమను చూపిన బాటలోనే తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిందని అని టిఆర్ఎస్ యువ నాయకులు వనపర్తి బద్రీనాథ్ గుప్తా. ఎండి . జానీ పాషాఅన్నారు .మంచాల మండల కేంద్రంలో జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జయశంకర్ సార్ కలలుగన్న తెలంగాణను ముందుకు తీసుకపోతాము అంటూ ఆయన త్యాగాల పటిమను సాధించిన ఘనత వల్లే తెలంగాణను అసాధించుకునుమని వారు తెలిపారు. తెలంగాణ అభివృద్ధి ముందుకు దూసుకుపోవాలని ఆయన చూపిన బాటలోనే తెలంగాణ ప్రభుత్వం నడుస్తున్నదని అన్నారు ఈ కార్యక్రమంలో మహేందర్. బొట్టు ప్రవీణ్ నాయక్. %u=ాం% నాయకులు ఆవుల ప్రశాంత్ యాదవ్. పరమేష్ జల్దీరెడ్డి కొత్తపెల్లి సాయి గౌడ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు,



## జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి నసర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి

ఇబ్రహీంపట్నం ఆగష్టు 06, ప్రజాపాలన ప్రతినిధి: ఇబ్రహీంపట్నం మంచాల మండలం ఆరుట్ల గ్రామపచాయితీ లో స్వరాష్ట్ర సాధనకోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు.తెలంగాణ స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ని గ్రామ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ కు దిక్సూచిగా నిలబడి తెలంగాణ ప్రజలకు అందివ్వాలని నిధులు నియామకాలు తెలంగాణలో అమలు పరచాలని నాలుగు కోట్ల ప్రజల తెలంగాణను తెచ్చిపెట్టిన ఘనత జయశంకర్ సార్ ది అని ఆయన అన్నారు. ఆధ్వర్యంలోనిరర్వహించడం జరిగింది.ఈకార్యక్రం లో ఉప సర్పంచ్ పాండల జంగయ్య గౌడ్ పంచాయితీ కార్యదర్శి జనార్దన్ రెడ్డి వార్డ్ సభ్యులు మణిపాటి వెంకటేష్, శివ కుమార్, మమత మల్లేష్, కొందూరి మల్లేష్, తులసి మరియు గ్రామపంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లి పాలపై కుటుంబ సభ్యులకు అవగాహన



వలిగొండ ఆగష్టు 06, ప్రజాపాలన ప్రతినిధి: బిడ్డల ఆరోగ్యానికి తల్లిపాలే దివ్యౌషధమని కుటుంబ సభ్యులకు అంగన్వాడీ టీచర్ సువర్ణ అవగాహన కల్పించారు.శుక్రవారం మండల పరిధిలోని వేములకొండ గ్రామంలో అంగన్వాడీ 3 వ సెంటర్లో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గృహ సందర్శనలో పాల్గొనిమాట్లాడుతూ పుట్టిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు పట్టాలని,ముర్రుపాలు చిన్నారుల్లో రోగనిరోధక శక్తిపెంచుతాయని,శిశువు ఎదగడానికి సరిపడే పోషకాలు,కాల్షియం, మాంసకృత్తులు,విటమిన్స్, ఐరన్ తల్లిపాలల్లో పుష్కలంగా ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందించిన సింగిల్విండో చైర్మన్



కొడివ్యాల ఆగష్టు 06 (ప్రజా పాలన ప్రతినిధి ): సింగిల్విండో చైర్మన్ మేనేని రాజనర్సింగ రావు అప్పారావుపేట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన గరిగంటి మల్లేశం కుటుంబానికి 5 వేల రూపాయల ఆర్థిక సహాయం,25 కిలోల బియ్యం అందించారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రసాద్ , సర్పంచ్ మల్లేశం గారు,ఐతం గణేష్,వార్డ్ మెంబెర్ అబ్రహం , అనుమాండ్ల అజయ్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు నేరళ్ల మహేష్, నాయకులు కొత్తూరు స్వామి గుండు రాజ్ కుమార్ కత్తి నరేష్ గౌడ్ గౌతమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేద్కర్



BUSSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి

BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది

అంబేడ్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేద్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం

అంబేద్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేద్కర్

జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్

ప్రజాపాలన

సంపాదకీయం

శనివారం 07, ఆగష్టు 2021

# వాతావరణ మార్పులపై 'వాణిజ్య' పోరు

యూరోపియన్ యూనియన్ ప్రతిపాదిస్తున్న కార్బన్ బోర్డర్ ట్యాక్స్ (హరిత గృహ వాయువుల ఉద్గారాలను నిరోధించే కఠిన చట్టాలు) అమలులో లేని దేశాల నుంచి అల్యూమినియం, ఉక్కు, సిమెంట్ మొదలైన వస్తువుల దిగుమతులపై విధించే సుంకాన్ని భారత్ వ్యతిరేకించి తీరాలా? దీనికి సమాధానంగా అవును, కాదు అని రెండూ చెప్పవలసి ఉంటుంది. అంతర్జాతీయ వాణిజ్యం హరిత గృహ వాయువుల ఉద్గారాలతో ముడివడి ఉంది. ఇతరదేశాలు కూడా కార్బన్ బోర్డర్ ట్యాక్స్ విధించేలా చేయడం ద్వారా కాలుష్యకారక వాయువుల ఉద్గారాలను నిరోధించడమే యూరోపియన్ యూనియన్ ప్రతిపాదన లక్ష్యం. అయితే, అసమానతలు అంతకంతకూ పెరిగిపోతున్న ప్రస్తుత ప్రపంచంలో వాతావరణ మార్పులపై పోరుకు దేశాల మధ్య అవసరమైన సహకారాన్ని పెంపొందించడానికి ఆ ప్రతిపాదన తోడ్పడుతుందా అనేది అసలు ప్రశ్న. 1990 దశకం తొలినాళ్ళలో ప్రపంచదేశాల నాయకులు సమావేశమై వాతావరణ మార్పుల విషమ ప్రభావాలను నిరోధించే విషయమై కూలంకషంగా చర్చించారు. పర్యావరణ సంక్షోభం ప్రపంచవ్యాప్తంగా తీవ్రమవుతున్న వాస్తవాన్ని గుర్తించి 'ఫ్రేమ్ వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ ఛేంజ్'పై సంతకాలు చేశారు. కాలుష్యకారక వాయువుల ఉద్గారాల వల్ల భూమి వేడెక్కిపోతోందని, ఈ పరిణామం వికృత వాతావరణ వైపరీత్యాలకు దారితీస్తుందనే భయానక సత్యాన్ని వారు అర్థం చేసుకున్నారు. ముఖ్యంగా కార్బన్ డైఆక్సైడ్ వాతావరణంలో శతాబ్దాల పాటు ఉంటుంది. 19వ శతాబ్దం మధ్యనాళ్ళలో పారిశ్రామిక విప్లవం ప్రారంభమైన కాలంలో వెలువడిన కార్బన్ ఉద్గారాలు ఇప్పటికీ వాతావరణంలో ఉండిపోయి భూ ఉష్ణోగ్రతలు పెచ్చరిల్లిపోయేందుకు కారణమవుతున్నాయి. ఇది, అందరికీ తెలిసిన వాస్తవమే. అయితే విశ్వవ్యాప్తమవుతున్న పర్యావరణ సంక్షోభాన్ని ప్రపంచ దేశాలు కలసికట్టుగా ఎదుర్కోవలసి ఉందనే విషయాన్ని గుర్తు చేయడానికే నేను దాన్ని పునరుద్ఘాటించాను. వాతావరణ విపత్తు తీవ్రమవుతున్న ప్రస్తుత యుగంలోనే ప్రపంచదేశాలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను ముమ్మరంగా చేసుకొంటున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలన్నీ అనుసంధానమవుతున్నాయి. భారీగా పెరిగిపోయిన ఉత్పత్తి కార్యకలాపాల వ్యయాన్ని తగ్గించుకునేందుకే సంపన్న దేశాలు పనిగట్టుకుని ప్రపంచీకరణను ప్రోత్సహిస్తున్నాయనేది ఒక కఠోర వాస్తవం. ఈ కారణంగానే అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రపంచీకరణ పట్ల వ్యతిరేకత పెరిగిపోతోంది. శ్రమ శక్తి చౌకగా లభించే చైనాలో తమ ఫ్యాక్టరీలను నెలకొల్పడం లాభదాయకంగా భావించిన పాశ్చాత్య సంపన్నదేశాలు, ముఖ్యంగా అమెరికా ఆ దేశంలో భారీ పెట్టుబడులు పెట్టాయి. సత్వర ఆర్థికాభివృద్ధికి ఆరాటపడుతున్న చైనా, ఆ మాటకు వస్తే ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలు పర్యావరణ పరమైన భద్రతలను ఉపేక్షిస్తున్నాయి. సంపన్నదేశాల లక్ష్యం ఫలించింది. ఆ దేశాలలో ఉత్పత్తి వ్యయాలు తగ్గాయి. వినియోగం పెరిగింది. చైనా, భారత్, ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలలో గణనీయమైన ఆర్థికాభివృద్ధి సుసాధ్యమయింది. ఇప్పుడు చైనా ప్రపంచంలోనే అతి పెద్ద ఎగుమతిదారు. ఆర్థికాభివృద్ధి సాధనలో అమెరికాను సైతం అధిగమించి గొప్ప ముందంజలో ఉంది. కరోనా మహమ్మారి కారణంగా అనేక దేశాల ఆర్థికవ్యవస్థలు కుదేలయిపోయాయి. అయితే అంతర్జాతీయ వాణిజ్యంలో చైనా వాటా అంతకంతకూ పెరుగుతోంది. మరి హరిత గృహ వాయువుల ఉద్గారాలలో చైనా ఇప్పుడు ప్రపంచ అగ్రగామిగా ఉండడంలో ఆశ్చర్యమేముంది? 2020 సంవత్సరంలో చైనా 10.35గిగాటన్నుల బొగ్గుపులుసు వాయువును వాతావరణంలోకి విడుదల చేసింది. అమెరికా కంటే రెట్టింపు స్థాయిలో వాతావరణ కాలుష్యానికి చైనా కారణమవుతుండడం గమనార్హం. అయితే దీనివల్ల పాశ్చాత్య సంపన్నదేశాలకు వివిధ సరుకులు చాలా చౌకగా లభ్యమవుతున్నాయి. ఆ మేరకు ఆ దేశప్రజల వినియోగమూ పెరిగిపోతోంది. 2015లో అమెరికాలో ఒక్కో వ్యక్తి 1990లో కంటే 50 శాతం అధికంగా వస్తువులు, సేవలను వినియోగించుకున్నాడు. ఇదంతా ఆర్థికవ్యవస్థల ప్రపపంచీకరణ ఫలితమేననడంలో సందేహం లేదు. విషాదమేమిటంటే సంపన్నదేశాలు తమ కార్బన్ ఉద్గారాలను తగ్గించలేదు. వస్తూత్పత్తి కార్యకలాపాలను ఇతర దేశాలకు తరలించినప్పటికీ వస్తుసేవలు, విద్యుత్ వినియోగం పెరుగుదల కొనసాగుతోంది. అదే సమయంలో చైనా, భారత్, బ్రెజిల్, వియత్నాం మొదలైన దేశాలలో కూడా హరిత గృహ వాయువుల ఉద్గారాలు భారీగా పెరిగిపోతున్నాయి. కార్బన్ బోర్డర్ ట్యాక్స్ ద్వారా ఆ పర్యావరణ విపత్తును నివారించేందుకు యూరోపియన్ యూనియన్ పూనుకుంది. సంకల్పం మంచిదే. అయితే ఆ ప్రతిపాదనలో అనేక లోపాలు, లొసుగులు ఉన్నాయి. గతంలో స్వేచ్ఛా వాణిజ్యానికి అనుకూలంగా వ్యవహరించిన దేశాలు ఇప్పుడు అందుకు విరుద్ధమైన ప్రతిపాదనలు ఎందుకు చేస్తున్నాయి? తమ స్వంత ఆర్థిక వ్యవస్థలను పరిరక్షించుకునేందుకే కాదూ? వస్తూత్పత్తి కార్యకలాపాలను దేశీయంగా నిర్వహించుకునేందుకు అమెరికా, యూరోపియన్ దేశాలు నిర్ణయించుకున్నాయి. ఆ నిర్ణయంలో భాగమే కార్బన్ బోర్డర్ ట్యాక్స్. అయితే వర్తమాన ప్రపంచం నిన్నటి ప్రపంచం కాదు. సరుకులను చౌకగా ఉత్పత్తి చేసి ఎగుమతి చేసినప్పుడే సత్వర అర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని అభివృద్ధి చెందుతున్న దేశాలు విశ్వసిస్తున్నాయి. మరి వాతావరణ ముప్పుకు కారణమవుతున్న ప్రపంచ వాణిజ్యవ్యవస్థను కార్బన్ బోర్డర్ ట్యాక్స్ మొదలైన చర్యలతో సంస్కరించడం సాధ్యమవుతుందా? ఆ చర్యలు సమస్య పరిష్కారానికి కాకుండా మరింత సంక్లిష్టమవడానికే తోడ్పడుతాయి. మరో ముఖ్యమైన విషయమేమిటంటే కార్బన్ బోర్డర్ ట్యాక్స్ ద్వారా యూరోపియన్ యూనియన్‌కు భారీ ఆదాయం సమకూరుతుంది. అసమానతలు మరింతగా పెరగడానికే అది దారితీస్తుంది. ఉత్పత్తి–వినియోగం పద్ధతుల్లో ఎటువంటి మార్పుకు దోహదం జరగదు. కాలుష్యకారక వాయువుల ఉద్గారాలు యథావిధిగా పెరిగిపోతుంటాయి. అంతర్జాతీయ వాణిజ్యం, వినియోగం సమస్యలను ప్రపంచం ఇంకెంత మాత్రం ఉపేక్షించలేదు. వినియోగాన్ని తగ్గించేందుకు, ఉత్పత్తి వ్యవస్థలను పర్యావరణ అనుకూలమైనవిగా చేసేందుకు కార్బన్ బోర్డర్ ట్యాక్స్ లాంటి వాటిని విధించడం తప్పనిసరి. తద్వారా సమకూరే ఆదాయాన్ని, వాతావరణ మార్పులతో అధికంగా ప్రభావితమవుతున్న దేశాలలో పర్యావరణ ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు వెచ్చించి తీరాలి. వాతావరణ మార్పు ప్రపంచ సమస్య అయినప్పుడు దానికి పరిష్కారం కూడా ప్రపంచస్థాయిలోనే ఉండాలి.

# కేరళ పారిశ్రామికీకరణ - సవాళ్ళు

కేరళలో లోని అధిక వేతనాల కారణంగా సుదూర ప్రాంతాలైన అసోం, పశ్చిమ బెంగాల్, ఒడిషా రాష్ట్రాల నుంచి వలస కార్మికులు భారీగా వచ్చారని సామాజిక–ఆర్థిక, పర్యావరణ అధ్యయన కేంద్రం నిర్వహించిన సర్వే చెప్తోంది. ఇక్కడ ఆసక్తికరమైన విషయం ఒకటుంది. వీటిలో కొన్ని రాష్ట్రాలు 'పరిశ్రమల–స్నేహపూరిత' రాజకీయ వాతావరణానికి, విధానాలకు ప్రసిద్ధి గాంచాయి. అధిక వేతనం కార్మికులకు ఆకర్షిస్తుందన్నది స్పష్టం. కానీ పెట్టుబడిదారులకు అది ఒక నిరోధకం. కేరళ వామపక్ష రాజకీయాలు... పారిశ్రామికీకరణ పట్ల ఊహాజనిత విముఖత... తిరిగి వార్తలలోకి వచ్చాయి. పిల్లల దుస్తుల తయారీలో ప్రపంచంలోకెల్లా రెండవ పెద్ద సంస్థ కీటెక్స్ గార్మెంట్స్ లిమిటెడ్....రూ. 3,500 కోట్లు విలువ చేసే పెట్టుబడి ప్రణాళికను కేరళ నుండి ఉపసంహరించుకోవాలనే నిర్ణయం ఈ వార్తలకు కారణం. ఆ కంపెనీ కేరళ నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకొని తెలంగాణలో పెట్టాలని నిర్ణయించుకుంది. కేరళలో రాజకీయ వాతావరణం తమ వాణిజ్యానికి అనుకూలంగా లేదని ఆరోపిస్తోంది.వామపక్ష పార్టీలకు కేరళ బలమైన కేంద్రం. పెట్టుబడిదారుల పట్ల కమ్యూనిస్టుల వ్యతిరేకత ఈ ప్రతిష్టంబనకు కారణమని అనేక మంది భావిస్తున్నారు. కేరళ పెట్టుబడి విధానంలోని లోపాలు, కేరళ ప్రభుత్వం కొత్త పెట్టుబడులను ఆకర్షించలేకపోవడం గురించి స్థానిక ప్రసార మాధ్యమాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతున్నది. భారతదేశంలో వివిధ రాష్ట్రాలకు ర్యాంకులు ఇచ్చేందుకు వీలుగా రిజర్వ్ బ్యాంకు ఏర్పాటు చేసిన సులభతర వాణిజ్య సూచిక ఆధారంగా, కేరళ 28వ స్థానంలో ఉండగా తెలంగాణ 3వ స్థానంలో ఉంది. రెండు దక్షిణాది రాష్ట్రాలను ఈ విధంగా పోల్చినప్పుడు తప్పనిసరిగా ఒక ప్రశ్న తలెత్తుతుంది. నీతి ఆయోగ్ తాజా సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సూచిక ప్రకారం కేరళ మొదటి ర్యాంక్ సాధించింది. అయినప్పటికీ పెట్టుబడిదారులు పెట్టుబడి పెట్టేందుకు కేరళను ఎందుకని ఎంచుకోవడం లేదు? వామపక్ష రాజకీయ సిద్ధాంతం కాకుండా మరేదైనా కారణముందా? ప్రభుత్వ విధానాల వల్లే కేరళ పరిశ్రమలను ఆకట్టుకోలేకపోతుందా ? గత సెన్సస్ ప్రకారం 3.5 కోట్ల జనాభాతో కేరళ రాష్ట్రం 38,863 చదరపు కిలోమీటర్ల వైశాల్యానికి పరిమితమై ఉంది. తెలంగాణలో కూడా సుమారుగా అంతే జనాభా ఉంది. కానీ ఆ రాష్ట్రం దక్షిణ పీఠభూమిలో 1,12,077 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉంది. గణాంకాలను పరిశీలించినట్లయితే తెలంగాణ రాష్ట్రం కన్నా కేరళ భూగోళికంగా 3 రెట్లు చిన్నది. కానీ రెండు రాష్ట్రాల్లో జనాభా సుమారుగా సమానంగా ఉంది. కేరళ ఒక ఉత్పత్తి కేంద్రం కావడానికి...జన సాంద్రత, భూమి విలువాలా ఎక్కువగా ఉండడం...అడ్డంకిగా వున్నాయనే అంశాన్ని తెలియచేయడానికి ఈ పోలికను ప్రస్తావించాను. భారత దేశ జన సాంద్రత ఒక చదరపు కిలోమీటరుకి 382గా ఉంది. అయితే కేరళలో జన సాంద్రత ఒక చదరపు కిలోమీటరుకి 859గా ఉంది. 'వ్యాపారానికి అనుకూలం'గా ఉన్న ప్రధాన రాష్ట్రాల జనసాంద్రతను పరిశీలించినట్లయితే పెద్ద భూభాగాలతో పాటు తక్కువ జన సాంద్రత ఉండడం ఈ రాష్ట్రాలకు సానుకూలమైన అంశం. ఉదాహరణకు భారత దేశ పారిశ్రామిక కేంద్రమైన గుజరాత్ రాష్ట్ర జనసాంద్రత చదరపు కిలోమీటరుకి 308 మాత్రమే. కేరళలో 30 శాతం భూమి అటవీ ప్రాంతం. అటువంటి ప్రదేశాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అనుమతించరనే వాస్తవాన్ని కూడా గమనంలో ఉంచుకోవాలి. ప్రఖ్యాత జీవావరణ శాస్త్రవేత్త మాధవ్ గాడ్గిల్ ఆధ్వర్యంలో పశ్చిమ కనుమల జీవావరణ నిపుణుల ప్యానెల్ 2011లో నిర్వహించిన అధ్యయనంలో చెప్పినట్టుగా కేరళలో అనేక ప్రాంతాలు జీవావరణపరంగా సున్నితమైనవి. పరిశ్రమలకు అనుకూలించనివి. ఎందుకంటే, అవి పర్యావరణాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయి కనుక. అందువల్ల కేరళని ఇతర రాష్ట్రాలతో పోల్చేటప్పుడు కేరళ ప్రత్యేక భౌగోళిక స్వభావాన్ని తప్పక పరిగణనలోనికి తీసుకోవాలి. భూమి లభించకపోవడం, జనసాంద్రత అధికంగా ఉండడం అనేవి రాష్ట్రంలో పెద్ద పరిశ్రమలు లేకపోవడానికి ప్రధాన కారణాలు. అయినప్పటికీ, ఇతర అంశాలు కూడా కేరళలో అటువంటి సంస్థలు తక్కువగా ఉండడానికి దోహదం చేశాయి. అనేక మంది పెట్టుబడిదారులు కార్మిక వేతనాల వ్యయం ఎక్కువగా ఉండడాన్ని తీవ్ర సమస్యగా పరిగణిస్తారు. కేరళ విపత్తు తరువాత అవసరాల అంచనా ప్రకారం...2018 ఘోరమైన వరదల తరువాత ఐక్యరాజ్య సమితి నిపుణులు, కేరళ ప్రభుత్వం నిర్వహించిన అధ్యయనం ప్రకారం, 35 లక్షల నైపుణ్యం కలిగిన, నైపుణ్యంలేని వలస కార్మికులు రాష్ట్రంలోని వివిధ రంగాల్లో పని చేస్తున్నారు. ఇది మొత్తం రాష్ట్ర జనాభాలో సుమారు పది శాతంగా ఉంటుంది. ఈ అధిక వేతనాలు అధిక వలసలను ప్రోత్సహిస్తున్నాయి. లేబర్ బ్యూరో, లేబర్, ఉద్యోగిత మంత్రిత్వ శాఖ ప్రచురించిన నివేదిక ప్రకారం కేరళలో నైపుణ్యం లేని పురుష కార్మికునికి సగటు వేతనం రూ. 700.70. అయితే జాతీయ సగటు రూ. 286.60. భారత ఉపఖండంలో ఇదే నైపుణ్యం లేని కార్మికులకు చెల్లించే అత్యంత ఎక్కువ వేతనం. 'సులభతర వాణిజ్య సూచిక' ప్రకారం అగ్ర స్థానంలో ఉన్న రాష్ట్రాల్లో వేతనాలను కేరళతో పోల్చినట్లయితే అత్యంత తక్కువగా ఉన్నాయి. ఆంధ్ర ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలు 'సులభతర వాణిజ్య సూచిక' ప్రకారం మొదటి స్థానంలో ఉన్నాయి. కానీ ఈ రాష్ట్రాల్లో సగటు వేతనాలు అతి తక్కువగా 301.30, రూ. 257.70 గా ఉన్నాయి. కేరళలో లోని అధిక వేతనాల కారణంగా సుదూర ప్రాంతాలైన అసోం, పశ్చిమ బెంగాల్, ఒడిషా రాష్ట్రాల నుంచి వలస కార్మికులు భారీగా వచ్చారని సామాజిక–ఆర్థిక, పర్యావరణ అధ్యయన కేంద్రం నిర్వహించిన సర్వే చెప్తోంది. ఇక్కడ ఆసక్తికరమైన విషయం ఒకటుంది. వీటిలో కొన్ని రాష్ట్రాలు 'పరిశ్రమల–స్నేహపూరిత' రాజకీయ వాతావరణానికి, విధానాలకు ప్రసిద్ధి గాంచాయి. అధిక వేతనం కార్మికులకు ఆకర్షిస్తుందన్నది స్పష్టం. కానీ పెట్టుబడిదారులకు అది ఒక నిరోధకం. కేరళ రాష్ట్ర అధిక అక్షరాస్యతను సామాజిక అభివృద్ధికి సూచికగా పరిగణించాలి. కానీ ఈ అత్యధిక అక్షరాస్యతే తమకు ప్రమాదం తెచ్చి పెడుతుందని పెట్టుబడిదారులు భావిస్తారు. ఈ ప్రజలకు తమ హక్కుల పట్ల అవగాహన ఉంటుందని, తమ హక్కుల కోసం గట్టిగా పోరాడతారని పెట్టుబడిదారులు నమ్మడమే దీనికి కారణం. ఇది గతంలో అనేక కంపెనీలలో యాజమాన్యాలకు, కార్మికులకు మధ్య ఘర్షణకు దారితీసింది. అదే కొన్ని సందర్భాల్లో కంపెనీల శాశ్వత మూసివేతకు కూడా దారితీసింది. కొన్ని సందర్భాల్లో అతి పెద్ద వ్యాపార సంస్థలు కూడా రాష్ట్రంలోని తమ కార్యకలాపాలను బలవంతంగా మూసివేశాయి. 2001లో ఆదిత్య బిర్లా యాజమాన్యం లోని గ్రాసిమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ శాశ్వత మూసివేత, ఈ రాజకీయ క్రియాశీలతకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. ఉద్యోగుల హక్కులను ఉల్లఘించడంతో పాటు పర్యావరణ కాలుష్యానికి వ్యతిరేకంగా ప్రజలు అనేక సంవత్సరాలపాటు పోరాటం చేసినందున కంపెనీ మూసివేయబడింది. అదే విధంగా కీటెక్స్ గార్మెంట్స్ తయారీ యూనిట్ల పర్యావరణ కాలుష్యానికి వ్యతిరేకంగా స్థానిక ప్రజలు అనేక పోరాటాలు చేసారు. కంపెనీ తన ఉద్యోగులకు కనీస వేతనాలను ఉల్లంఘించినందుకు కేరళ హైకోర్టులో కేసును ఎదుర్కొంటోంది. కార్మికుల రాజకీయ సమీకరణలు పెట్టుబడిదారులను దుర్బలులను చేస్తాయనేది కాదనలేని సత్యం. దేశంలో ప్రతి రాష్ట్రానికి తనకంటూ ప్రత్యేకమైన వనరులు, లక్షణాలు వున్నాయి. కనుక, ఒకే కొలమానాన్ని ఉపయోగించి రాష్ట్రాలను 'పరిశ్రమలకు అనుకూల లేదా ప్రతికూల' రాష్ట్రాలుగా వర్గీకరించడం అశాస్త్రీయమైనది. 'సులభతర వ్యాపార సూచిక'ను పెట్టుబడిదారుల దృక్పథం నుంచి, వారి సౌలభ్యం ఆధారంగా నిర్ణయించకూడదు. జీవావరణ పరంగా చూసినట్లయితే సున్నితమైన అరేబియన్ సముద్ర తీరం, పశ్చిమ కనుమల మధ్య వున్న ఒక చిన్న రాష్ట్రం కేరళ. ఇది పరిశ్రమల కోసం పెద్ద భూభాగాలను కేటాయించలేదు. 'సులభతర వ్యాపారం' అంటే సాగు భూములను లేదా జీవావరణపరంగా సున్నితమైన భూములను పారిశ్రామిక పార్కులుగా మార్చడమే అన్నట్లయితే... కేరళ ఆ ర్యాంకుల జాబితాలో విశిష్టమైన స్థానం కోసం ప్రయత్నం చేయకూడదు. కేరళ అభివృద్ధి ప్రణాళిక నమూనా...తెలంగాణ లేదా గుజరాత్ మాదిరిగా ఉండకూడదు.

# కోవిడ్ సమయంలో "అంబేద్కర్ యూనివర్సిటీ" విద్యార్థి సహాయ సేవలు భేష్

భారత దేశంలో మొదటి సార్వత్రిక విశ్వవిద్యాలయం అయిన అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రారంభంలో ఆంధ్రప్రదేశ్ ఓపెన్ యూనివర్శిటీగా 1982 ఆగస్టు 26న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ (%ూూూఖ% చట్టం 1982) ద్వారా స్థాపించబడింది. తదనంతరం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీగా 1991, అక్టోబర్ 26న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్చింది. మారుతున్న వ్యక్తిగత, సామాజిక అవసరాలను తీర్చడానికి సమాజంలోని అన్ని వర్గాలకు ఉన్నత విద్య అవకాశాలను అందించడానికి అంబేద్కర్ ఓపెన్ 53.63 ఎకరాల్లో అంబేద్కర్ ఓపెన్ విశ్వవిద్యాలయం స్థాపించారు. విశ్వవిద్యాలయం అందించే అన్ని కోర్సులని న్యూ ఢిల్లీలోని యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ గుర్తించింది. ఈ విశ్వవిద్యాలయం నినాదం "అందరికీ విద్య". దేశంలో ఓపెన్ యూనివర్సిటీ లలో డిగ్రీ స్థాయిలో సెమిస్టర్ విధానం ప్రవేశ పెట్టిన మొదటి ఓపెన్ యూనివర్సిటీ.

కోవిడ్–19 సమయంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశ పెట్టిన విద్యార్థి సహాయ సేవలు మంచి ఫలితాలు ఇచ్చాయి. ముఖ్యంగా ప్రవేశాలలో మన రాష్ట్రంలో మొదటి సారి ఆన్ లైన్ లో దూర విద్యా ప్రవేశాల దరఖాస్తులు మొదలు పెట్టిన యూనివర్సిటీ అయినప్పటికీ కోవిడ్ సమయంలో ప్రత్యక్ష సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ లేకుండా నేరుగా వెబ్ సైట్ లలోనే సంభందిత ధ్రువ పత్రాల అప్ లోడ్ ఆప్షన్ ఇవ్వటం వలన విద్యార్థులు నేరుగా వారి ఇంటి నుండే ప్రవేశాలు పొందారు. సమాచారం కోసం సోషల్ మీడియా టెలిగ్రామ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఒక ఛానల్ ని కుడా ఏర్పాటు చేసారు. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న విషయ నిపుణులతో యూనివర్సిటీ క్యాంపస్ నుండి ఆన్ లైన్ తరగతులను కుడా నిర్వహించారు. డిగ్రీ , పి.జి , డిప్లొమా అన్ని కోర్సులకి తరగతులని జూమ్, యూ ట్యూబ్ ద్వారా నిర్వహించి విద్యార్థులకు మరింత చేరువయ్యారు. ఈ విధంగా నూతన భోధన అభ్యసయన సంస్కరణలు తీసుకొస్తూ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ తెలుగు రాష్ట్రాల్లో మరింత ఆదరణ పొందుతుంది. దూర విద్య చరిత్రలో మొదటిసారిగా ఇటీవల ఇందిరా గాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఓపెన్ యూనివర్సిటీలు న్యాక్ గ్రేడ్ లు సాధించాయి. దేశంలో మొదటి సార్వత్రిక యూనివర్సిటీ అయిన అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కుడా వచ్చే ఏడాది న్యాక్ గ్రేడింగ్ పొందే విధంగా కావలసిన విధానాలను రూపొందించటంలో వర్శిటీ అధికారులు కృషి చేస్తున్నారు. దేశంలో ఉన్న ఓపెన్ యూనివర్సిటీ లలలో ఎప్పటికప్పుడు నూతన విధానాలను నేటి ఆధునిక కాలానికి అనుగుణంగా సంస్కరణలను ఏర్పాటు చేయటంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ముందు ఉంటుంది.అందుకు అనుగుణంగా వచ్చే ఏడాది సెమిస్టర్ విధానం , అన్ని ప్రోగ్రాములు ఇంగ్లీష్ మీడియంలో ఉండేలా మరిన్ని ఉపాధి , నైపుణ్యం గల నూతన ప్రోగ్రాములను తీసుకవచ్చేలా కృషి చేస్తున్నారు. కరోనా రెండో దశ తర్వాత పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థులు తమ విద్యా సంవత్సరం నష్ట పోకుండా చర్యలు తీసుకున్నారు. కోవిడ్ సమయంలో డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులకు పుస్తకాలూ ముద్రణ కాకపోవటం వల్ల వారికి %వ% – కోర్సు మెటీరియల్ సాఫ్ట్ కాపి రూపంలో అందించి పరీక్షలు నిర్వహించారు. యూ ట్యూబ్ లో రికార్డ్ చేసిన భోధన వీడియోలను, ఆడియో లెసన్స్ పొందుపరచారు. దూరదర్శన్ ద్వారా టెలి కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ అభ్యర్థుల సందేహాలని నివృతి చేస్తున్నారు. సామాజిక మాధ్యమాలలో కుడా విద్యార్థులకు సమాచారాన్ని చేరవేశారు. డిజిటల్ మూల్యాంకనం ద్వారా సకాలంలో పరీక్షా ఫలితాలు విడుదల చేస్తూ, డిగ్రీ పూర్తి చేశాక విద్యార్థులు ఇంటి వద్దకే సర్టిఫికెట్స్ పంపిస్తున్నారు దేశంలో అతిపెద్ద సార్వత్రిక యూనివర్సిటీ అయిన ఇగ్నో యెక్క అనుభవాలని కుడా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో స్వీకరిస్తే మంచి ఫలితాలు వస్తాయి. గతంలో నూతన ప్రోగ్రాములను ప్రవేశ పెట్టాలని చూసినా కోవిడ్ వల్ల ఈ ఏడాది కొత్త కోర్సుల ప్రతిపాదన లేకుండానే నూతన ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేశారు. న్యాక్ గుర్తింపు లో నూతన కోర్సులు ఉపయోగపడతాయి. సాధారణ ప్రోగ్రాముల తో పాటు ఉపాధి అవకాశాలు గల ప్రోగ్రాములని ప్రవేశపెట్టాలి. అందుకు అనుగుణంగా ఉన్నత విద్యా సంస్థలు, వివిధ విశ్వవిద్యాలయాల తో అనుసంధానం చేసుకొని పని చేయాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా డిమాండ్ ఉన్న డేటా సైన్సు, ఆర్టిఫిషల్ ఇంటలిజన్స్ లాంటి సాంకేతక కోర్సులతో పాటు, సైన్సు, సామజిక శాస్త్రాలలో సోషల్ ఆంత్రోపాలజీ, సోషల్ వర్క్, డెవలప్మెంట్ స్టడీస్, రూరల్ డెవలప్మెంట్, ఇంటర్నేషనల్ స్టడీస్, జెండర్ స్టడీస్, అర్బన్ స్టడీస్ అధునాతన లాంటి కోర్సులని ప్రవేశపెట్టాలి. తెలంగాణలో నూతన జిల్లాల కేంద్రంలో నూతన ప్రాంతీయ సమన్వయ కేంద్రాలను ఏర్పాటు చేస్తే గ్రామీణ, గిరిజన ప్రాంత వాసులకి దూర విద్యా మరింత చేరువలో ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా సేవలు అందిస్తున్న అంబేద్కర్ యూనివర్సిటీని కొన్ని సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రధానంగా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో అధ్యాపకుల, నాన్ టీచింగ్ ఉద్యోగుల కొరత వేదిస్తుంది. ప్రధాన క్యాంపస్ లో పాటు ఉమ్మడి జిల్లాల్లో ఉన్న ప్రాంతీయా సమన్వయ కేంద్రాలలో కుడా భోధనేతర సిబ్బంది కొరత ఉంది. చాలా ఏళ్ళ నుండి ఒప్పంద, తాత్కాలిక విధానంలో పని చేస్తున్నారు. ప్రాంతీయ సమన్వయ కేంద్రాలలో అన్ని మౌలిక వనరులని, అధునాతన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ ప్రభుత్వం అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మరియు అధ్యయన కేంద్రాల అభివృద్ధికై మరిన్ని నిధులని కేటాయించాలి. ఖైదీలకు, ఆర్మీ, జవాన్లకు కుడా ఉన్నత విద్యను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ భవిష్యత్తులో వెనుకబడిన యస్.సి, యస్.టి, ఒంటరి మహిళలు, వితంతువులు, ట్రాన్స్ జెండర్, బలహీన వర్గాలకు, కోవిడ్ ద్వారా తల్లిదండ్రులని కోల్పోయిన విద్యార్థులకు ఉచిత ఉన్నత విద్యని అందిచాలని కోరుకుంటున్నాం. జాతీయ స్థూల నమోదు నిష్పత్తిలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కీలక పాత్ర పోషిస్తూ తెలుగు రాష్ట్రాల ప్రజలకి భవిష్యత్తులో ఉన్నత విద్యని మరింత దగ్గర చేయాలని ఆశిద్దాం.

**శ్రవణ్ కుమార్ కందగట్ల**
**కాకతీయ యూనివర్సిటీ,**
**86393 74879**

## గుమ్మడిదల లో నట్టల నివారణ మందులు పంపిణీ



గుమ్మడిదల ఆగష్టు 06, ప్రజాపాలన ప్రతినిధి:మండల కేంద్రంలో పశు వైద్య అధికారులు ఏర్పాటు చేసిన ఉచిత నట్టల నివారణ వైద్య శిబిరంలో స్థానిక జడ్పిటిసి కుమార్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ నర్సింహారెడ్డితో కలిసి ఆయన గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పిటిసి కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఈ శిబిరాన్ని పాడి సంపద గల రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశువులకు సకాలంలో నట్టల నివారణ మందులు వెయ్యాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రవీందర్రెడ్డి, సత్యనారాయణ, ఆంజనేయులు, భాస్కర్, రాము, కొండల్ రెడ్డి, వెంకటేష్, పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అల్లి నగర్ లో డెంటల్ క్యాంపు



జిన్నారం ఆగష్టు 06, ప్రజాపాలన ప్రతినిధి:మండలం గడ్డపోతారం గ్రామ పంచాయతీ పరిధిలోని అలీ నగర్ లో మమత హాస్పిటల్ వారి డెంటల్ హెల్త్ క్యాంపు ను సర్పంచ్ పులిగిల్ల ప్రకాష్ చారి గారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ డెంటల్ క్యాంపులో పంటి సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తారని,గ్రామస్తులు అందరూ ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మమత హాస్పిటల్ సిబ్బంది ఆంజనేయులు గౌడ్ ప్రతిమ ,శ్రీలత వార్డు సభ్యులు పూజారి వీరేశం గౌడ్ ,నారా బోయిన నర్సింగ్రావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభోత్సవం



మేడిపల్లి, ఆగస్టు6 (ప్రజాపాలన ప్రతినిధి) బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 27వ డివిజన్లో రూ 5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ బంధారం అంజలి శ్రీధర్ గౌడ్ తో కలిసి మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవి గౌడ్ ప్రారంభించారు. కార్పొరేషన్లోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు మేయర్ సామల బుచ్చిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బంధారం అంజలి శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ డివిజన్లోని సమస్యలను పరిష్కరిస్తూ, డివిజన్ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోదుగు శేఖర్ రెడ్డి,యువనాయకులు బంధారం శ్రీధర్ గౌడ్,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## "ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ 87 వ జయంతి"




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 06 (ప్రజాపాలన) :: తెలంగాణ జాతిపిత, సిద్ధాంత కర్త, ప్రజల గుండెల్లో నిలిచిన చిరస్మరణీయుడు, ప్రొఫెసర్ ఆచార్య జయశంకర్ 87వ జయంతి వేడుకలను విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) ఐక్య సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ విశ్వ బ్రాహ్మణ (విశ్వకర్మ) ఐక్య సంఘం నాయకులు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ ముద్దుబిడ్డ, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం అలుపెరుగని పోరాటం చేసి, తెలంగాణ భావజాల వ్యాప్తికి జీవితాంతం ఎనలేని కృషి చేసిన వ్యక్తి, భవిష్యత్ తరాలు గుర్తించుకునే విధంగా వారి సంకల్ప బలం స్థాపనకు చేసిన నిర్విరామ కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ ఐక్య సంఘం జిల్లా, మండల, అధ్యక్ష కార్యదర్శులు,శ్రీరామోజు భాస్కరాచారి, బట్టుపెల్లి అశోక్ చారి, చిలుకూరి రాధాకృష్ణ చారి, గౌరవ అధ్యక్షులు తూమోజు సురేష్ చారి, ఉపాధ్యక్షులు శ్రీరామోజు వెంకటయ్య చారి, సహాయ కార్యదర్శి శ్రీమంతుల వేణుగోపాల్ చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ వనపర్తి సదాశివ్ చారి, లు పాల్గొన్నారు.

# మేము సైతం అంటూ... ఆలేరు ఎన్ .సి.సి. క్యాడేట్లు

ఆలేరు, ఆగష్టు 06, ప్రజాపాలన ప్రతినిధి:మనిషి తలచుకుంటే సాధించలేనిది ఏమీ లేదని చేసి నిరూపించారు ఆలేరు ప్రాంతవాసి వెంకటేష్ దూడల బృందం. తనకు విద్యాబుద్ధులు నేర్పించిన మహానుభావులందరికి వందనాలు అంటూ... ఆలేరు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గతంలో పనిచేసిన యన్.సి.సి. అధికారి గా పనిచేసిన సుధాకర్ రెడ్డి ఉపాధ్యాయుని ప్రేరణతో తను యన్.సి.సి.లో చేసినట్లు తెలిపారు. అదే స్ఫూర్తితో ఆలేరు లోని ప్రభుత్వ పాఠశాలలో యన్.సి.సి. ద్వారా అనేక సహాయక అవగాహన కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. కరోనా మహమ్మారి బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తీర్మానించుకున్నారు. ఇందులో భాగంగా కరోనా ఏ విధంగా అరికట్టవచ్చు అని ప్రజలకు అవగాహన చేయాలని తమ వంతు బాధ్యతగా 28 ఏప్రిల్ 2021 నాడు మొదటి పోస్టర్ ను విడుదల చేశారు.ప్రపంచాన్నే గడగడ లాడించిన మొదటి దశ కరోనా మహమ్మారి 2020 లో చేసిన నష్టం నేటికీ అంచనాలకు మించినది. గత సంవత్సరం కరోనా లాక్ డౌన్ మూలంగా ప్రజలు ఏ విధంగా అవస్థలు పడ్డారు ఇంకా కళ్ల ముందు కదలాడుతూనే ఉన్నది. విధ్యార్థులు, వ్యాపారస్తులు, వలస కూలీలు, రైళ్లు,బస్సులు, ప్రైవేటు వాహన దారులు,క్యాబ్ డ్రైవర్లు, అన్ని రంగాల్లోని ప్రజలు కరోనా మొదటి మరియు రెండవ దశలో చేసిన నష్టాన్ని మరవక ముందే మూడో దశ కరోనా మహమ్మారి విజృంభిస్తోంది అంటున్నారు శాస్త్రవేత్తలు. నాడు వెంటిలేటర్ల కొరత, నేడు ఆక్సిజన్ కొరత తో ప్రాణాలు కోల్పోతున్నారు. గతంతో పోలిస్తే ఈ సారి పిల్లలపై ప్రభావం ఎక్కువ అని అంటున్నారు నిపుణులు.ప్రతి దినం ఎంత మంది కరోనా బారిన పడి మరణించిన ఇప్పటికీ మన కళ్ల ముందు కదలాడుతూనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితి నుండి ప్రజలను కాపాడడానికి, కరోనా పై అవగాహన కల్పించడానికి ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కొందరు యన్.సి.సి. క్యాడెట్లు 10వ బెటాలియన్ ఎన్.సి.సి. వరంగల్ ఆధ్వర్యంలో దూడల వెంకటేష్ అధ్యక్షతన మేము సైతం అంటూ నడుము బిగించి ముందుకు వచ్చారు. 2021 మే 28వ తేదీన మొదలైన ఈ యజ్ఞం నేటికీ 100 రోజులు పూర్తి చేసుకున్నట్లు వెంకటేష్ దూడల తెలిపారు.100 వ రోజు పోస్టర్ కూడా విడుదల చేశారు. కరోనా వ్యాపించకుండా ప్రజలు ఏ విధంగా అప్రమత్తం చేయాలి, ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలి, కరోనా సోకిన వారు మనో ధైర్యం కోల్పోకుండా ఉండడానికి ఏమి చర్యలు తీసుకోవాలి, ఐసోలేషన్ లో ఉన్నప్పుడు ఎలా మెదలాలి, మాస్క్, శానిటైజర్ వాడకం, ఎక్కువ సార్లు చేతులు నీటితో శుభ్రంగా కడుక్కోవడం, భౌతిక దూరం పాటించడం , ప్రభుత్వం ఇచ్చే సలహాలు, సూచనలు తూ.చ. తప్పకుండా పాటించడం,మూడో దశ కరోనా నివారణ మొదలగు అనేక అంశాలపై పోస్టర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి రోజు ఒక్క అంశం పైన పోస్టరును వివిధ రకాలుగా తయారు చేసి న్యూ మీడియా, ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా ప్రజలను అప్రమత్తం చేశారు. ఈరోజు 100 రోజులు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్.సి.సి. తరపున కరోనాపై అవగాహనలో భాగంగా రోజుకొక పోస్టర్ తయారు చేసి న్యూ మీడియా వాట్సాప్, ట్విట్టర్, ఫేస్ బుక్, ఇన్స్టాగ్రామ్ మొదలగు వాటిని ఉపయోగించుకున్నారు. చంద్రునికో నూలుపోగు మా వంతు చిరు ప్రయత్నం అంటూ జి. సౌజన్య,టి. నేహా, కే. భాగ్య,ఎన్. మాళవిక,ఎం. ఆకాష్,జి. శివకుమార్ ,రాజేష్ మొదలు విద్యార్థులు యన్.సి.సి. జట్టుగా ఏర్పడి కరోనా మహమ్మారి పై




ప్రజలకు అవగాహన కల్పించి 100 రోజులు పూర్తి చేసుకున్న.. ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్.సి.సి. క్యాడెట్లు చేసే ప్రయత్నాన్ని తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు ఎంతో అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరున మరియు మీడియా మిత్రులకు వెంకటేష్ దూడల కృతజ్ఞతలు తెలియజేశారు.

## గ్రామపంచాయతీ రికార్డులు పరిశీలించిన డి ఎల్ పి ఓ



వలిగొండ ఆగష్టు 06, ప్రజాపాలన ప్రతినిధి: మండల పరిధిలోని వెలువర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో డి ఎల్ పి ఓ సాధన శుక్రవారం గ్రామపంచాయతీ రికార్డుల పరిశీలన చేశారు. గతంలో గ్రామ మాజీ సర్పంచ్ మల్లం శ్రీనివాస్ గౌడ్ గ్రామంలో గత తొమ్మిది నెలల కాలం నుండి గ్రామసభలు నిర్వహించక పోవడం వలన గ్రామాభివృద్ధి కుంటుపడుతుందని కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్పీవో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక వార్డు మెంబర్లు విచారణను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. కొద్దిసేపు వార్డు మెంబర్లు,నాయకుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దీనిపై గ్రామ ప్రజలు సర్పంచ్,వార్డ్ మెంబర్ ల మధ్య అవగాహన లోపంతో గ్రామ సభలు నిర్వహించకపోవడం వలన గ్రామంలో అభివృద్ధి కుంటుపడిందని,ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని,గ్రామపంచాయతీలో జవాబుదారి తనం లోపించడం వలన ప్రభుత్వ పథకాలు అర్హులకు అందకపోతే లేక పోతున్నాయని అభిప్రాయపడ్డారు. ఇప్పటికైనా పాలకవర్గం అభిప్రాయ భేదాలను పక్కన పెట్టి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పసల అన్న మేరి శౌరీ,ఉప సర్పంచ్ తక్కెళ్ల శ్రావణి, ఎంపీడీవో కేదారేశ్వర్,వార్డు మెంబర్లు కాల్కురి ముత్యాలు,గుర్రాల రాములు, ఎడవెల్లి మల్లేశం, విజయలక్ష్మి,కవిత,మాజీ సర్పంచ్ మల్లం శ్రీనివాస్ గౌడ్,నాయకులు తక్కెళ్ల సంజీవ,మల్లం సాలయ్య, ఎడవెల్లి యాదగిరి,ఉక్కుర్తి చంద్రయ్య,బూడిద ఈదయ్య,కాల్కురి శంకరయ్య,బూడిది పాపయ్య,కాల్కురి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులు చేయించిన 12వ వార్డు కౌన్సిలర్ నెల్లి శ్రీలత రమేష్



బెల్లంపల్లి ఆగస్టు 6 ప్రజా పాలన ప్రతినిధి: గత కొన్ని సంవత్సరాలుగా మురికి కాలువల్లో పేరుకు పోయినన ఇసుకమేట ను చెత్తాచెదారాన్ని ప్రత్యేక పారిశుద్ధ్య సిబ్బందితో తొలగించినట్లు 12వ వార్డు కౌన్సిలర్ శ్రీలత రమేష్ తెలిపారు. శుక్రవారం నాడు ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వార్డులోని పాత ఎంపీడీవో కార్యాలయం నుండి మజీద్ లైన్ వరకు ఇసుకమేట లతో చెత్తాచెదారం తో నిండిపోయి ఉన్న మురికి కాలువలు దుర్గంధంతో వాసన వస్తుండగా స్థానిక ప్రజలు చేసిన విజ్ఞప్తి మేరకు మున్సిపల్ అధికారులకు తెలుపగా స్పందించిన అధికారులు ప్రత్యేక టీమ్ ని, ట్రాలిని పంపించి మురికి కాలువలు శుభ్రం చేయించారనీ, ఈ సందర్భంగా అధికారులకు సిబ్బందికి ఆమే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెరాస నాయకుడు నెల్లి రమేష్, శానిటరీ ఇన్స్ పెక్టర్ సుధాకర్,మొకాద్దాం ఇంద్రపాల్, శ్రీను,రామస్వామి పాల్గొన్నారు.

## బహుజన లెఫ్ట్ ఫ్రంట్ సదస్సును జయప్రదం చేయండి

**ఎం సి పి ఐ ( యు) ఉమ్మడి జిల్లా కార్యదర్శి సబ్బని కృష్ణ**



బెల్లంపల్లి ఆగస్టు 6 ప్రజా పాలన ప్రతినిధి: ఈ నెల 8వ తేదీ ఆదివారం నాడు బెల్లంపల్లి పట్టణం లోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ లో జరిగే( బిఎల్ఎఫ్) బహుజన లెఫ్ట్ ఫ్రంట్ సదస్సుకు అన్ని వర్గాల అన్ని కులాల వారు హాజరై సదస్సును విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. శుక్రవారం నాడు సదస్సు కరపత్రాలను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎస్సీ ఎస్టీ, బిసి, మైనారిటీలు 93 శాతం ప్రజలు ఉండగా రాజ్యాధికారానికి దూరంగా ఉంటున్నారని, ఈ అగ్రవర్ణ పాలకులు దూరం చేస్తున్నారని ఈ విధానాన్ని తిప్పికొట్టడానికి ఓట్లు మావి, సీట్లు మీవా అని ప్రశ్నించడానికే బహుజన రాజ్యాధికారం స్థాపించడానికే, ఎర్రకోటపై లాల్ నిల్ జెండా ఎగరవేయడానికే, తెలంగాణ రాష్ట్రంలో 3 సంవత్సరాల క్రితం ఈ బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఏర్పడిందని, ఆనాటినుండి ఇప్పటివరకు ఐక్యత కోసం బిఎల్ఎఫ్ కృషి చేస్తుందని అందులో భాగంగానే ఆదివారం నాడు బిఎల్ఎఫ్ సదస్సును బెల్లంపల్లిలో ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఈ సదస్సుకు కు ఎం సిపిఐ( యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్, బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకటి, వల్లెపు ఉపేందర్రెడ్డి, హాజరుకానున్నారని కావున అన్ని వర్గాల అన్ని కులాల వారు హాజరై ఈ సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## పశు వైద్యశాల ను వినియోగించుకోవాలి

**ఎంపీపీ అరిగెల మల్లికార్జున్**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 06 (ప్రజాపాలన) : గ్రామాలలో నిర్వహించే పశువైద్యశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇటిక్యాల గ్రామములో నిర్వహించిన పశు వైద్య శిబిరం లో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పశు వైద్యానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని అన్నారు. జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్, వైద్యాధికారి మురళీకృష్ణ, మాట్లాడుతూ ఏడు రోజులుగా నిర్వహించే ఉచిత గొర్రెలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, రైతులు ప్రతి ఒక్కరూ తమ పశువులకు నట్టల నివారణ మందులు తీసుకోవాలన్నారు. 1956 జీవాలకు నివారణ మందులు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది నాగన్న, రాజు, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ వ్యాప్తికి గొప్ప కృషి చేసిన వ్యక్తి



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 06 (ప్రజాపాలన) : తెలంగాణ ఉద్యమ భావజాల వ్యాప్తికి జీవితాంతం కృషిచేసిన ప్రొఫెసర్ ఆచార్య జయశంకర్ సదా స్మరణీయుడని జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశం అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో కొత్తపల్లి జయశంకర్ 87 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి, స్మరించుకుంటారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జయశంకర్ ఆశించిన తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, అన్ని రంగాలలో సమగ్రాభివృద్ధి సాధించడమే ఆయన ఆశయ సాధన మని అన్నారు. తెలంగాణ యావత్ ప్రజానీకం మనసులో జయశంకర్ సార్ కు ప్రత్యేక స్థానం ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సురేష్, డిస్యో స్వామి కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమానికి పూర్తి ప్రదాత జయశంకర్

జిన్నారం ఆగస్టు 6 ప్రజా పాలన ప్రతినిధి తెలంగాణ ఉద్యమ జ్యోతి నాలుగు కోట్ల ప్రజలలో ఉద్యమ చైతన్యం రగిలించిన తెలంగాణ సిద్ధాంతకర్త తెలంగాణ ఉద్యమానికి పూర్తి ప్రదాత ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు పాలు పార్టీలకు చెందిన నాయకులు కుల సంఘాలకు చెందిన నాయకులు ఉద్యోగ సంఘాల నాయకులు జయశంకర్ సార్ కు నివాళులు అర్పించారు.



# బెల్లంపల్లిలో ఘనంగా జయశంకర్ జయంతి ఉత్సవాలు

బెల్లంపల్లి ఆగస్టు 6 ప్రజా పాలన ప్రతినిధి: తెలంగాణ జాతిపితగా పిలుచుకొనే ప్రజల గుండె చప్పుడు ఆచార్య జయశంకర్ గారి జయంతి ఉత్సవాలను బెల్లంపల్లి పట్టణంలో శుక్రవారం ఘనంగా వారు నిర్వహించారు.బెల్లంపల్లి పట్టణలోని విశ్వ బ్రాహ్మణ సంఘం ఆద్వర్యంలో ప్రొపెసర్ జయశంకర్ గారి జయంతి సందర్భంగా ఎర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ముఖ్య అతిథి గా హాజరై న మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య జయశంకర్ గారిని గుర్తు చేసుకుంటు 60ఎల్లబానిస బ్రతుకు ల్లో నుండి తెలంగాణ నేడు స్వేచ్ఛ వాయువులు పీల్చుకొని బంగారు తెలంగాణ వైపు అడుగులు వేస్తున్నది అంటే ఉద్యమవే ఊపిరిగా వెన్నుక్కవోని ఆత్మ విశ్వాసంతో తోలి దశ, మలిదశ, తెలంగాణ ఉద్యామాలకు ,మన నీల్లు ,మన నిదులు ,మన నియామకాలు మనకే రావలని చివరి వరకు పోరాడి యావత్ తెలంగాణ సమాజాన్ని ఎకతాటి పై కి తెచ్చిన మహోన్నత వ్యక్తి అని ఆచార్య జయ శంకర్ గారిని యావత్ తెలంగాణ జయశంకర్ గారిని గుండెల్లో పెట్టుకున్నారని అన్నారు. విశ్వ బ్రాహణులఅబివృద్ది కోరకు ముఖ్యమంత్రి కెసిఆర్ చిత్తశుద్ది తో పనిచేస్తున్నారని ,అలాగే విశ్వ బ్రాహ్మనుల నమన్యలపై ఎమ్మెల్యే దుర్గంచిన్నయ్య, అసెంబ్లీ సాక్షి గా తన వాణి ని వినిపించారని గుర్తు చేశారు,

సమయం సందర్భం వచ్చినపుడు విశ్వ బ్రాహ్మణులు టిఆర్ ఎస్ పక్షాన నిలబడుతు వారి



సహకారం అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాముల్ నాయక్,మాటురి మదు, మరియు విశ్వ బ్రాహ్మణ సంఘం అద్యక్షుడు ఎర్రోజు నతీష్ ,సినియర్ నాయకులు శంకర్ సింగ్, బ్రహ్మనందం ,కొండపలకల శ్రీనివాస్ ,సత్యనారయణ ,కట్ట శ్రీనివాస్,ప్రభాకర్, మరియు విశ్వ బ్రాహ్మణ సంఘం సబ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రొఫెసర్ జయశంకర్ 87 వ జయంతి వేడుకలు

బాలాపూర్: ఆగష్టు 06, ప్రజాపాలన ప్రతినిధి: జయశంకర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్ బిక్షపతి చారి అన్నారు. మీర్ పేట్ కార్పొరేషన్ లోని 27వ డివిజన్ కార్పొరేటర్ పసునూరి బిక్షపతి చారి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ విశ్వబ్రాహ్మణ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ 87వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటానికి పూలమాల వేసి, జోహార్ జోహార్ నినాదాలతో నివాళు లర్పించారు. స్థానిక కార్పొరేటర్ మాట్లాడుతూ.... తెలంగాణ ఉద్యమానికి దిక్సూచిగా నిలిచిన మహోన్నత వ్యక్తి, వారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకు తీసుకెళ్లాల్సిన ఎంతో అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ బిజెపి కార్పొరేటర్లు ఫ్లోర్ లీడర్ గోవర్ధన్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, మీర్ పేట్ ప్రధాన కార్యదర్శి కోడూరు సోమేశ్వర్, రంగారెడ్డి జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షులు అమర్నాథ్రెడ్డి, శివ కుమార్ చారి, రుద్ర శీను, వెంకటేష్, %ూ%.రాజు,భాస్కర్ చారి, అరవింద్, సత్తయ్య, మల్లికార్జున్, కాలనీవాసులు బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికులకు కెసిఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

**సిఐటియు జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్**
**కలెక్టరేట్ ఎదుట ధర్నా, డిఆర్వో కు వినతి**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 06 (ప్రజాపాలన) : గ్రామ పంచాయతీ కార్మికులకు కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, డిఆర్వో కదం సురేష్ కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్, జిల్లా ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్, జిల్లా కార్యదర్శి రాజేందర్ లు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత జీవో 51 సవరించి, కనీస వేతనం రూ 21వేలు,ఇవ్వాలని, ప్రభుత్వ శాఖలో పనిచేసే పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, పార్ట్ టైం, ఫుల్ టైం, సిబ్బందితోపాటు స్కీం వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచిందని, కానీ గ్రామపంచాయతీ లలో పనిచేస్తున్న సిబ్బందికి మాత్రం వేతనాలు పెంచలేదన్నారు. ఇది కార్మికులను విస్మరించడమే, సీఎం కేసీఆర్ దళిత ఎంపవర్మెంట్ సమావేశం ఏర్పాటు చేసి దళితులకు దళిత బంధును ప్రకటించారన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాలు పెంచితే వారికి పిఆర్సి తరహాలో నిర్ణయాత్మకమైన ఉద్యోగ భద్రత చర్యలు తీసుకుంటామని సీఎం ప్రకటించిన నిర్ణయం పట్ల సిఐటియు హర్షం వ్యక్తం చేసిందన్నారు. కావున రాష్ట్రములో ఇతర ఉద్యోగులకు వేతనాలు పెంచిన విధంగానే గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని, తగిన ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఆర్సి వర్తింపజేయాలని, ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులందరికీ ప్రతి నెల మొదటి వారంలో వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని, "గ్రామపంచాయతీ కారోబార్" లకు పదోన్నతులు కల్పించాలని, ఈ ధర్నా సందర్భంగా ప్రభుత్వాన్ని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, అండ్ వర్కర్స్ యూనియన్, డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల గ్రామపంచాయతీ కార్మికులు, నాగేశ్వర్, శ్రీకాంత్, రాజు, శంకర్, జనార్ధన్, శ్రీనివాస్, సాయి,శ్యామల,పుష్పలత,తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికులకు లాభాల వాటా ప్రకటించాలి

**మనీ రామ్ సింగ్, టిఎన్టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు**



బెల్లంపల్లి ఆగస్టు 6 ప్రజా పాలన ప్రతినిధి:కరోణా కారణంగా లాక్ డౌన్ విధించిన ఉన్న పని రోజుల్లోనే పనిచేసి సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యాన్ని చేధించిన సింగరేణి కార్మికులకు వెంటనే లాభాల వాటా ప్రకటించి వచ్చిన లాభాల్లో నుండి 35 శాతం లాభాల వాట ఇవ్వాలని టి ఎన్ టి యు సి రాష్ట్ర ఉపాధ్యక్షులు మనిరాం సింగ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు ఆయన స్థానిక టిఎన్టియుసి కార్యాలయంలో మాట్లాడుతూ గత సంవత్సరం కరోనా వైరస్ కారణంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో లాక్ డౌన్ విధించడం జరిగిందనీ దాంట్లో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిలో కూడా 42 రోజులు లాక్ డౌన్ విధించడం జరిగిందనీ అయినా కోవిద్ -19 ను లెక్క చేయకుండా తమ ప్రాణాలను పణంగా పెట్టి వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడానికి వారి భార్య పిల్లల్ని కూడా వదిలి ఉత్పత్తి తీసినారు, కాబట్టి గత సంవత్సరం 2020-21 ఇ సంవత్సరానికి సంబంధించిన లాభాలు ఇంతవరకు సింగరేణి యాజమాన్యం ప్రకటించలేదనీ కార్మికులు లాభాల వాటా కోసం ఎదురు చూస్తున్నారని వచ్చిన లాభాలను వెంటనే ప్రకటించి 35 శాతం లాభాల వాటా కార్మికులకు ఇవ్వాలని అన్నారు.లేనియెడల అన్ని గనులపై జిఎం కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో టి ఎన్ టి యు సి నాయకులు రాష్ట్ర ఉపాధ్యక్షులు టి మనీ రామ్ సింగ్, రీజియన్ ఉపాధ్యక్షులు జి నారాయణ, బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షులు సిరికొండ కనకయ్య, రాములు, జిల్లా నాయకులు జీవరత్నం ,శ్రీనివాస్, కె యాదగిరి, జీ, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## గోపన్ పల్లి తండాలో కూల్చివేతలకు సిద్ధమవుతున్న రెవెన్యూ అధికారులు



శేరిలింగంపల్లి, ప్రజాపాలన ప్రతినిధి : శేరిలింగంపల్లి మండలం గోపన్ పల్లి తండా గ్రామకంఠం కు చెందిన స్థలమైనప్పటికి అధికారులు మాత్రం సర్వే నం.34 కు చెందిన ప్రభుత్వ భూమి అంటూ గోపన్ పల్లి తండా గ్రామకంఠం కు చెందిన స్థలమైనప్పటికి అధికారులు మాత్రం సర్వే నం.34 కు చెందిన ప్రభుత్వ భూమి అంటూ అందులోని ఇళ్లను రెవెన్యూ అధికారులు కూల్చివేతలకు సిద్ధమవడంతో భవన యజమానులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వివరాల్లోకి వెళితే గోపన్ పల్లి తండా నుంచి కొల్లూరు అవుటర్ రింగ్ రోడ్డుకు లింకు రోడ్డు ( రేడియల్ రోడ్డు) నిర్మాణానికి గాను గోపన్ పల్లి తండా లోని సుమారు 45 భవనాలు అడ్డంకి కాగా వాటిని తొలగించేందుకు రెవెన్యూ అధికారులు యజమానులకు 2021 జూన్ 25వ తేదీన రాజేంద్ర నగర్ రెవెన్యూ డివిజన్ అధికారులు నోటీసులు అందజేశారు. రోడ్డు విస్తరణ నిర్మాణానికి 45 మంది భవన యజమానులు ఒప్పుకున్నారు. జూలై 5 వ తేదీలోపు స్థలాలకు సంబంధించిన పత్రాలను ఆర్డీఓ కార్యాలయంలో అందజేయాలని రెవెన్యూ అధికారులు తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేసి ఇదిలా ఉంటే నోటీసులు అందుకున్న వారికి శుక్రవారం రాజేంద్రనగర్ ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ తో సమావేశం ఉందని గురువారం రాత్రి సమాచారం అందించారు. శుక్రవారం ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లిన భవన యజమానులతో సమావేశం నిర్వహించకుండా ఆర్డీఓ అధికారి లేరని అక్కడి అధికారులు చెప్పడంతో వెనుదిరిగే దశలో సంబంధిత అధికారులు వారిని వారించి మాట్లాడే ప్రయత్నం చేశారు. రోడ్డు విస్తరణలో భవనాలు కోల్పోయే వారికి నష్టపరిహారం త్వరలోనే అందజేస్తామని ఈ లోపు నష్టపరిహారం చెక్కులను అందుకున్నట్లు సంతకాలు పెట్టాలని ఒత్తిడి చేశారు. పరిహారం తీసుకోకముందే తీసుకున్నట్లు సంతకాలు ఎలా తీసుకుంటారని ప్రశ్నించగా మీరు సంతకాలు పెట్టినా పెట్టకున్నా రోడ్డు నిర్మాణానికి మీ భవనాలను జేసీబీలతో తొలగించడం జరుగుతుందని రెవెన్యూ అధికారులు చెప్పడంతో భవనాల యజమానులు ఒక్క సారి విస్మయానికి గురయ్యారు. రెవెన్యూ అధికారులు ఎలాంటి సర్వే చేయకుండానే అర్హులను కాదని ఇష్టారీతిగా వారికి నచ్చిన పేర్లు నమోదు చేసుకుని కూల్చివేతలకు ఆఘమేఘాల మీద రంగం సిద్ధం చేసుకుంటున్నారు. గోపన్ పల్లి తండా గ్రామకంఠం కు చెందిన స్థలమైనప్పటికి అధికారులు మాత్రం సర్వే నం.34 కు చెందిన ప్రభుత్వ భూమి అంటూ ఖరీదు చేయకపోవడంతో గ్రామస్తులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు డీఏఓ అమరజ్యోతిని కలిసిన గ్రామస్తులు తమ భూములకు ఖరీదు కట్టి తగిన నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.


ప్రజాపాలన

జాతీయ తెలుగు దినపత్రిక తెలుగురాష్ట్రాల్లో విస్తృత పర్చేందుకు మా బిజినెస్ అసోసియేట్స్‌ను మీకు పరిచయం చేస్తున్నాం. దిగువ ఇవ్వబడిన బిజినెస్ అసోసియేట్స్ 'ప్రజాపాలన' జాతీయ తెలుగు దినపత్రికలో వార్తా సంబంధ విషయాల్లో,ప్రకటనలు స్వీకరించేందుకు,ప్రజాపాలన దిన పత్రిక చందా విషయమై ఎప్పుడూ మీకు అందుబాటులో ఉంటారు.

**బిజినెస్ అసోసియేట్స్-టెలిఫోన్ నెంబర్లు**

| | | |
|---|---|---|
| కడమంచి నారాయణ దాస్ | చేవెళ్ల | 9849526878 |
| డి. వరప్రసాద్ | తెల్లాపూర్ | 9553999990 |
| గణేష్ | బాలాపూర్ | 7993047109 |
| నరోత్తమ్‌రెడ్డి | మేడిపల్లి | 9346970159 |
| వెంకటచారి | మందమర్రి | 9440868581 |
| వెంకటస్వామి | మంచిర్యాల | 9515048103 |
| కళ్యాణ్ సి.ఎం. | కూకట్‌పల్లి | 7842672389 |
| ఎం. గైబులు | వికారాబాద్ | 9704570475 |
| జి.వి. శైలజ | శేర్లింగంపల్లి | 8919627871 |
| సత్య కిషోర్ | సిద్దిపేట | 6309723472 |
| సిహెచ్.ఆంజనేయులు | పరిగి | 966410714 |
| బోడ మనోహర్ నంద | కరీంనగర్ | 9492417684 |
| బోడ మమత | జగిత్యాల | 9491127684 |
| ఓవి.దుర్గారావు | భద్రాద్రి కొత్తగూడెం | 9581872881 |
| జె.రాంబాబు | అశ్వరరావుపేట | 9505678245 |
| బి.శ్రీకాంత్ | భద్రాచలం | 9398430470 |
| సి.సుధీర్‌కుమార్ | సుజాతనగర్ | 9701992529 |
| రాజేందర్ ప్రసాద్ | ఖమ్మం | 7013953536 |
| పి.ఎన్.శ్రీనివాస్ | మధిర | 9030821362 |
| గంజిగుంట్ల వెంకన్న | పాలేరు | 9848895405 |
| ఆర్.రాజేశ్వర్ రావు | మయూర్ సెంటర్ | 9160400339 |
| మాలేదు నరేందర్ | ఖమ్మం రూరల్ | 8074550397 |
| టివిఎస్.చక్రవర్తి | ఖమ్మం టౌన్ | 9948327333 |
| కె.సత్యం | పటాన్‌చెరు | 9866500289 |


# సింగరేణి పాలిటెక్నిక్ లో చేరుటకు నోటిఫికేషన్ విడుదల

**సింగరేణి ఉద్యోగుల పిల్లలు, మాజీ ఉద్యోగుల పిల్లలకు మాత్రమే**

మందమర్రి ఆగష్టు 6 ప్రజాపాలన ప్రతినిది: సింగరేణి కాలరీస్ పాలిటెక్నిక్ నస్పూర్, మంచిర్యాల లో జరుగు పాలిసెట్ 2021కౌన్సిలింగ్ కు సింగరేణి ఉద్యోగుల పిల్లలు, మాజీ ఉద్యోగుల పిల్లలు,పాలిసెట్ 2021లో అర్హత పొందిన వారు హాజరు కావల్సిందిగా తెలిపారు. సీట్ల వివరాలు ఈ విదంగా ఉన్నాయి. సివిల్ - 30, కంప్యూటర్ -30, ఎలక్ట్రికల్,ఎలక్ట్రానిక్స్ -30, మెకానిక్ -30, మైనింగ్ -30ఉన్నట్లుగా తెలిపారు. ఈ కోర్సులలో చేరదలచిన విద్యార్దులు 06-08-2021 నుండి 20-08-2021 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డన్లోడ్ చేసిన దరఖాస్తు కు ఫోటో అతికించి సంబందిత అదికారితో అటెస్టేషన్ చయించాలని తెలిపారు. కౌన్సిలింగ్ కు పాలిసెట్ రాంక్ కార్డు, హాల్ టికెట్, పదవ తరగతి మోమో 1నుండి 10వతరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు కులము సర్టిఫికెట్ (మీ సేవ నుండి తేది:30-04-2021)తరువాత పొందినదై ఉండాలని , ఆదార్ కార్డు 3 సెట్లు జిరాక్స్‌లు తీసుకొని రావాలని తెలిపారు.

# బోడుప్పల్ కార్పొరేషన్ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా:మేయర్ సామల బుచ్చిరెడ్డి



మేడిపల్లి, ఆగస్టు6 (ప్రజాపాలన ప్రతినిధి) :బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని నగర మేయర్ సామల బుచ్చిరెడ్డి పేర్కొన్నారు. కార్పొరేషన్లోని 11వ డివిజన్ తిరుమల మెడోస్ కాలనీలో రూ 13 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ కొత్త శ్రీవిద్య చక్రపాణి గౌడ్ తో కలిసి మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవి గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దొంతరబోయిన మహేశ్వరి, సీనియర్ నాయకులు కొత్త చక్రపాణి గౌడ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు కడుపుకోత కోసినా పగవారు...



పరిగి 6ఆగస్ట ప్రజా పాలన ప్రతినిధి: రైతు పంట నాశనం చేసిన ఘటన వికారాబాద్ జిల్లా పరిగి మండల పరిధిలోని యబాజిగుడెం గ్రామంలో చోటుచేసుకుంది.బాధిత రైతు రాజు తెలిపిన వివరాల ప్రకారం తమ పెద్దమ్మ పార్వతమ్మ, మహేందర్, కోడలు లక్మి,, కూతురు మంజులలు తాము సాగుచేస్తున్న ఎకరన్నర పత్తి మొలకను పీకేసి పొలంలో కుప్పలుగా ఉంచారని అలాగే ఎకరా మొక్కజొన్న పొలానికి నిషేధిత రసాయనాన్ని పిచికారీ చేయడం వల్ల ఏపుగా పెరిగిన మొక్కజొన్న పూర్తిగా ఎండి పోయిందని రైతు బోరుమని విలపించాడు.సుమారు నాలుగు లక్షల పంటనష్టం అయ్యిందని తమకు న్యాయం చేయవలని రైతు కోరారు.

# మధిరసేవ సమితి ఆధ్వర్యంలో పేదలకు కుట్టు మిషన్లు పంపిణి



మధిర, ఆగష్టు 06, ప్రజాపాలన ప్రతినిధి: మున్సిపాలిటీమధిర సేవా సమితి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతో అభినందనీయమని టిఆర్ఎస్ పట్టణ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం మధిర సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా కళ్యాణ మండపం లో హరే రామ హరే కృష్ణా ట్రస్టు ఆర్థిక సహకారంతో ఏర్పాటుచేసిన కుట్టు మిషన్లను పేదలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధిర సేవా సమితి ఆధ్వర్యంలో 20 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని ఆయన గుర్తుచేశారు. కుట్టు మిషన్ల ద్వారా మహిళల్లో ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు కుల మత వర్గ విభేదాలు లేకుండా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్న మధిర సేవా సమితిని, సామాజిక సేవా సంస్థలు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు. మధుర సేవ సమితి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు అనంతరం తాను అండగా ఉంటానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు మధిర సేవా సమితి అధ్యక్షులు పల్లపోతు ప్రసాద రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారి నాగేశ్వరావు ఆర్యవైశ్య సంఘం ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు ఇరుకుళ్ళ లక్ష్మీ నరసింహారావు టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు దేవిశెట్టి రంగారావు, శివాలయం చైర్మన్ వంకాయల పాటి నాగేశ్వరరావు చావా వేణు కనుమూరి వెంకటేశ్వరరావు,అరిగే శ్రీనివాసరావు మధిర సేవాసమితి నిర్వాహకులు మిరియాల కాశీ విశ్వేశ్వర రావు, ఎర్ర లక్ష్మణ్, చారు గుండ్ల నరసింహమూర్తి షేక్ జహంగీర్, కోమటీడీ శ్రీనివాస రావు, కోమటి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధం - సోషలిజం

# సోషలిజం అంటే ఏమిటి?



- బి ఎస్ రాములు
సెల్: 8331966987

(ముప్పై రెండవ భాగం)

ఒక వ్యక్తి ఒకే విలువ, ఒకే వోటు తాలూకు రాజకీయ ప్రజాస్వామ్యం ద్వారా సామాజిక ఆర్థిక రంగాల్లో యిదే విలువను సాధించాలని ఆశించాడు అంబేడ్కర్. ఆయన పెట్టుబడిదారీ విధానాన్ని ప్రైవేటు యజమాని యొక్క నియంతృత్వం అని స్పష్టం చేశాడు.

26 జనవరి 1950 నాడు నూతన రాజ్యాంగం గురించి అంబేడ్కర్ యిలా చెప్పాడు. 'రాజకీయ రంగంలో మనకు సమానత్వం వుంటుంది. సామాజిక ఆర్థిక జీవితంలో అసమానత వుంటుంది. రాజకీయాల్లో మనం ఒక మనిషి ఒక వోటు, ఒక విలువ అనే సూత్రాన్ని గుర్తించబోతున్నాము. మన సామాజిక ఆర్థిక నిర్మాణం కారణంగా మన సామాజిక, ఆర్థిక జీవితంలో ఒక మనిషి ఒక విలువ సూత్రాన్ని నిరాకరించడాన్నే కొనసాగించబోతున్నాము. జీవితంలోని యీ వైరుధ్యాలను మనం ఎంత కాలం నిరాకరించనిస్తాం? మనం దీర్ఘకాలం నిరాకరించాలనుకుంటే మన రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టడం ద్వారానే సాధ్యమవుతుంది. ఈ వైరుధ్యాన్ని మనం వీలైనంత తొందరగా నిర్మూలించాలి. ఆ పని చేయకపోతే అసమానతల్తో పీడింపబడేవారు యీ రాజ్యాంగ నిర్ణాయక సభ ఎంతో శ్రమపడి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామ్యం యొక్క నిర్మాణాన్ని కూలదోస్తారు'.

రాజకీయ ప్రజాస్వామ్యం ద్వారా సామాజిక ప్రజాస్వామ్యాన్ని, ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించాలన్న అంబేడ్కర్ ఆశయం వాస్తవరూపం దాల్చలేదు. రాజకీయ ప్రజాస్వామ్యం తన రాజకీయ ప్రయోజనాల కోసం అసమానతల పాత సామాజిక (కుల) నిర్మాణాన్ని మరింత కట్టుదిట్టం చేస్తోంది. రాజకీయ ప్రజాస్వామ్యం ద్వారా జీవితంలో సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించాలని కృషి చేస్తున్న శక్తులు లేకపోలేదు. వారి వల్లనే యీ మేరకైనా ప్రజాజీవితం అభివృద్ధి జరిగింది. కమ్యూనిస్టులు, నక్సలైట్లు కూడా పీడిత వర్గ రాజకీయ ప్రజాస్వామ్యం ద్వారానే జీవితంలో సామాజిక ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించవచ్చు అని ఆచరిస్తున్నారు. ఉద్యమాలు నిర్మిస్తున్నారు. అందువల్ల దృక్పథంలో, ఆచరణలో మార్క్సిజానికి, సోషలిజానికి, అంబేడ్కరిజానికి మధ్య ఏకసూత్రత ఉన్నది.

అదే సమయంలో అంబేడ్కర్ ప్రపంచ సోషలిజం అవగాహనలకు కొన్ని మార్పులు చేశాడు. రాజ్యం కేవలం అణచివేత సాధనం అనే మార్క్సిజం సూత్రీకరణను ఆయన అంగీకరించలేదు. రాజ్యం ద్వారా రాజ్యంలో సంక్షేమం యొక్క స్వభావాన్ని పెంచడమే సోషలిజం అంతిమ లక్ష్యం. అందుకు నిరంతరం కృషి చేసినవాడు అంబేడ్కర్. రాజ్యాన్ని సంక్షేమ స్వభావంలోకి మార్చడాన్ని మొదట బౌద్ధం ప్రతిపాదించింది. సామ్రాట్ అశోకుడు దాన్ని ఆచరించి చూపాడు. ఆ తర్వాత రెండున్నర వేల యేళ్లకు మార్క్స్, ఎంగెల్స్‌లు రాజ్యాన్ని సంక్షేమ రాజ్యంగా మార్చవచ్చని కొత్తగా కనుక్కున్నట్లు కమ్యూనిజం, సోషలిజం చర్చలో చెప్పారు.

ఆస్తిపై హక్కు ద్వారా రాజ్యం ఉత్పన్నమై కొనసాగుతున్నదని మార్క్సిజం అంటుంది. అంబేడ్కర్ దీన్ని మరింత ఉన్నతీకరించాడు. జ్ఞానాన్ని ఆస్తిగా, జ్ఞానంపై హక్కుద్వారా, జ్ఞానాన్ని యివ్వ నిరాకరించడం ద్వారా రాజ్యం యొక్క దోపిడి, అణచివేత సాగుతున్నాయని, బ్రాహ్మిణిజం వందలాది యేళ్లు యిదే పని చేసిందని నిర్ధారించాడు అంబేడ్కర్. మరో మాటలో చెప్పాలంటే జ్ఞానం అనేది వ్యక్తిగత ఆస్తి హక్కు కావడం నుంచే రాజ్యం యొక్క అణచివేత ఉత్పన్నమై కొనసాగుతున్నదని అంబేడ్కర్ స్పష్టం చేశాడు.

విప్లవం అనివార్యమని బలప్రయోగం ద్వారా అస్తిత్వంలో గల దోపిడీ శక్తుల్ని కూల్చివేయాలని సోషలిజం కోసం మార్క్సిస్టుల అనివార్యతా సిద్ధాంతాన్ని (కర్మ సిద్ధాంతాన్ని) ప్రతిపాదించారు. అంబేడ్కర్ యీ రెంటితో మౌలిక స్థాయిలో విభేదించాడు. ప్రజలు విప్లవాలు చేయడానికి వారిలో ఆసక్తి, పట్టుదల, జ్ఞానం ముఖ్యమని అది వుంటే ప్రజల సమ్మతిని సాధించే భావజాల విప్లవాన్ని వేగవంతం చేయడం ద్వారా పెద్దగా బలప్రయోగంతో పని లేకుండానే సామాజిక వైరుధ్యాలు పరిష్కరింపబడే మార్గం కూడా వుంటుందని ఆచరించి చూపాడు అంబేడ్కర్. ఇలా ప్రపంచంలోని సోషలిజం ఆలోచన, ఆచరణలకు అంబేడ్కర్ ఎన్నో మౌలిక చేర్పులందించాడు. వాటిలో ముఖ్యమైనవి.

1. రాజకీయ ప్రజాస్వామ్యం ఆసరాతో సోషలిజం లక్ష్యాలకు రాజ్యాంగ ప్రతిపత్తినిచ్చి క్రమంగా రాజ్యాంగ యంత్రంలో సామాజిక ప్రజాస్వామ్యానికి, సామాజిక న్యాయంతో కూడిన అభివృద్ధికి కృషి చేయవచ్చునని ఆచరించి చూపడం.

2. రాజ్యాంగ యంత్రాన్ని దాని అణిచివేత స్వభావాన్ని హరిస్తూ సంక్షేమ రాజ్యం కోసం పరివర్తన చెందే కృషి చేసి చూపడం.

3. పరాయికరణ, అణిచివేత, రాజ్యం అనేవి వ్యక్తిగత ఆస్తి నుండే కాకుండా, ఆస్తిని, జ్ఞానాన్ని, కంట్రోలు చేయడం, జ్ఞానాన్ని యివ్వనిరాకరించడం నుండి కూడా పుడ్తున్నాయని బ్రాహ్మణిజం చర్చతో నిర్ధారిస్తాడు అంబేడ్కర్.

4. కార్మిక వర్గ నియంతృత్వంతో పని లేకుండానే సోషలిజాన్ని యితర మార్గాలతో సాధించే కృషి చేయవచ్చునని ఆచరించి చూపాడు.

5. వ్యవసాయక దేశంలో, అధిక జనాభా గల చైనాలో మావో గాని, మనదేశంలో కమ్యూనిస్టులు గానీ, నక్సలైట్లు గానీ సాధించని మరో అంశాన్ని అంబేడ్కర్ సాధించాడు. విద్య, ఉద్యోగ అవకాశాల పెంపుదల, పారిశ్రామిక అభివృద్ధి కోరుతూ రిజర్వేషన్ల ద్వారా అన్నిటిలో భాగస్వామ్యం సాధించడం ద్వారా భూమి మీద వుండే జనాభా ఒత్తిడి తగ్గించే మార్గం వేయబడింది. మార్క్సిస్టు పరిభాషలో చెప్పాలంటే భూస్వామ్య విధానానికి అశేష ప్రజానీకానికి మధ్య వుండే వైరుధ్యాన్ని వర్గ వైరుధ్యంగా అక్కడే పరిష్కరించకుండా అందులోని ప్రజలు అనే అంశంలోని సెక్షన్లను అంతకన్నా అభివృద్ధి చెందిన ఉత్పత్తి సంబంధాల్లోకి పెట్టుబడిదారీ, వృత్తి వుద్యోగాల్లోకి బదిలీ చేశాడు. దీంతో వర్గ వైరుధ్యం, సామాజిక వైరుధ్యం యిరుపక్షాల్ని చీల్చి పోరాటం ద్వారా పరిష్కరించే క్రమానికి కాలం తీరిపోయి అవశేషాలను నిర్మూలించే కార్యక్రమంగా పరిష్కరించే ప్రయోజనానికి పరిమితమైంది.

6. "దున్నేవానికే భూమి" పెట్టుబడిదారీ సమాజం కన్నా కాలానికన్నా వెనుకబడిపోయిన లేకుండానే సోషలిజాన్ని యితర జీవితాన్ని ప్రజలకు హామీ ఇస్తుంది. తద్వారా పెట్టుబడిదారీ లాభోక్తుల కన్నా నిరంతరం వెనుకబడి జీవించే వెనుకబాటుతనాన్ని విప్లవ విజయం పేరిట ప్రజలకు అందిస్తుంది. ఈ ఆచరణలో పెట్టుబడిదారీ అభివృద్ధిలోని ప్రతిదీ పాలకవర్గాల, పాలక కులాల హుక్కుభుక్తంగా వదిలివేయబడుతుంది. రిజర్వేషన్ ద్వారా సాధించిన హక్కులే యిందులో భాగస్వామ్యానికి అవకాశం ఇచ్చాయి. అంబేడ్కర్ ప్రకారం భారత సామాజిక ఆర్థిక నిర్మాణంలో పూర్తి మార్పు భారత రాజ్యాంగ లక్ష్యం. ఈ రాజ్యాంగ ఆదేశిక సూత్రాల మార్గ నిర్దేశకత్వంలో, సారంలో సోషలిస్టు స్వభావం కలవి కాకపోతే సోషలిజం అంటే ఏమిటో నేను అర్థం చేసుకోవడంలో విఫలమయ్యానని అర్థం అని సవాలు చేశాడు అంబేడ్కర్. ఇలా మార్క్సిజం చెప్పే సోషలిజంలోను, మొత్త సోషలిజం ఆలోచన ఆచరణలోను ఎన్నో మౌలిక విషయాలను, విజయాలను చేర్పు చేసింది అంబేడ్కరిజం. తద్వారా ప్రపంచంలోని సోషలిజంలో అంబేడ్కరిజం ఒక అవిభాజ్యమైన అంతర్భాగమైంది. సోషలిజానికి అంబేడ్కర్ చేసిన చేర్పు మహత్తరమైంది.

(తరువాయి భాగం వచ్చే సంచికలో)

# విద్యార్థులకు నిరుద్యోగులకు తోడుగా కార్పొరేటర్ కేతావత్ సుభాష్ నాయక్



మేడిపల్లి, ఆగస్టు6 (ప్రజాపాలన ప్రతినిధి) : జ్ఞాన సముపార్జన కొరకై అనునిత్యం విద్యార్థులకు,నిరుద్యోగులకు తోడుగా ఉంటూ వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్న పీర్జాదిగూడ నగరపాలక సంస్థ 2వ డివిజన్ కార్పొరేటర్ కేతావత్ సుభాష్ నాయక్. కార్పొరేటర్ కేతావత్ సుభాష్ నాయక్ ఓ సాదాసీదా మనిషి,కల్మషం ఎరుగని మనిషి,అతడు ఆపాదమస్తకం స్వార్థం లేని మనిషి, సమాజాభివృద్ధికి తోడ్పడడమే కాక విద్యాభివృద్ధికి ముందుండే కృషీవలుడు, మానవ సేవే-మాధవ సేవ అనే శీర్షిక అనుసారంగా కష్టసమయంలో ముందుండే గొప్ప మానవతావాది.కార్పొరేటర్ కేతావత్ సుభాష్ నాయక్ కరోనా వైరస్ విలయతాండవం చేస్తున్న సమయంలో కూడా వేల మంది కుటుంబాలకు మనోధైర్యాన్ని ఇస్తూ వారికి అన్నీ రకాల సహాయం అందించిన గొప్ప సేవాతత్పరుడు.అందులో భాగంగా 04-08-2021 నాడు దిల్ సుఖ్ నగర్లో పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగార్థం కోసం శిక్షణ పొందుతున్న 12 మంది అభ్యర్థులకు లైబ్రరీ పుస్తకాల కోసం అవసరమయ్యే ఖర్చు 10,000/- రూపాయలను అభ్యర్థులకు అందజేయడం జరిగింది.మక్త వెంకటాపూర్ గ్రామ యువనాయకుడు కేతావత్ గోవింద్ నాయక్ దగ్గర యువకులు వారి సమస్యలను తీసుకెళ్ళిన వెంటనే గోవింద్ నాయక్ ద్వారా కేతావత్ సుభాష్ నాయక్ పీర్జాదిగూడ-మేడిపల్లి కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్ళడంతో వారి చేత అనేక సందర్భాల్లో ఆర్థిక సహాయాన్ని అందింపజేయడం జరిగింది. గతంలో కూడా కరోనా మహమ్మారీ విజృంభణ చేస్తున్న సమయంలో కూడా మహారాష్ట్రలో వలసవెళ్ళిన వందలాది కుటుంబాలకు నిత్యావసరాల కోసం తన శక్తి ఆర్థిక సహాయం అందించడం జరిగింది. మక్త వెంకటాపూర్ పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను అందించి విద్యా కోసం అనునిత్యం ముందుండి పాటుపడే వ్యక్తి కేతావత్ సుభాష్ నాయక్ పీర్జాదిగూడ-మేడిపల్లి కార్పొరేటర్ కు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీటీఓ రాంచందర్, విస్లావత్ శ్రీను, కే సంతోష్, కే శ్రీను, జే రాజు, వి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## బడంగ్ పేట్ కార్పొరేషన్ నందు ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



బాలాపూర్: ఆగస్ట్ 7, ప్రజాపాలన : స్వరాష్ట్రం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయులు ప్రొఫెసర్ జయశంకర్ అని కార్పొరేషన్ మేయర్ పారిజాత పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో శుక్రవారం ప్రో. జయశంకర్ సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... స్వరాష్ట్రం కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయులని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, డీఈఈ అశోక్ రెడ్డి, కార్పొరేటర్లు సుర్ణగంటి అర్జున్, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, నాయకులు లిక్కి కృష్ణ రెడ్డి, రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, ఏఈఈ బిక్కు నాయక్ కార్యాలయ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతును రాజును చేయటమే సిఎం లక్ష్యం:సబితా ఇంద్రారెడ్డి

వికారాబాద్ బ్యూరో 06 ఆగస్ట్ ప్రజాపాలన : రైతును రాజును చేయడమే లక్ష్యంగా సిఎం కెసిఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్ నియోజక పరిధిలో గల ధారూర్ మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోస్నం వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మోమిన్ కలాన్ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, నాగారం సర్పంచ్ కిరణ్ కుమార్ రెడ్డి, గురుదొట్ల సర్పంచ్ అనిత రాజేందర్, మున్నూరుసోమారం సర్పంచ్ పులిగారి అనూష రాంరెడ్డి ల సమక్షంలో రైతు వేదికలను, ధారూర్ సర్పంచ్ చంద్రమౌళితో కలిసి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తీసుకున్న చర్యలతో 3 కోట్ల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండించి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది అని పేర్కొన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చేపట్టిన పూడికతీతతో నేడు చెరువులు, కుంటల్లో భూగర్భభ జలాలతో జల కళ లాడుతుంది అని కొనియాడారు. వికారాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేస్తూ ధారూర్ మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన రైతు వేదికలను రైతులకు అంకితం చేశారు. వికారాబాద్ శాసన సభ్యులు మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో దారూర్ మండలం మోమిన్ కలాన్, నాగారం, గురుదొట్ల, మున్నూరు సోమారం గ్రామ పంచాయతి పరిధిలో నిర్మించిన రైతు వేదికలను ఎమ్మెల్సీ సురభి వాణి దేవి, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ నాగేందర్ గౌడ్, జడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్ లతో కలిసి ప్రారంభించారు. రైతులకు పెట్టుబడి సహాయంగా రైతు బంధు,రైతుకు గిట్టుబాటు ధర కల్పిస్తూ పంట కొనుగోలు,24 గంటల విద్యుత్, ఎరువులు,విత్తనాలు అందుబాటులో ఉంచి,నకిలీల పై ఉక్కుపాదం మోపుతూ,రైతు భీమా లాంటి అనేక పథకాలతో తెలంగాణ రాష్ట్రంలో రైతు రాజ్యం నడుస్తుందని పేర్కొన్నారు. ధారూర్ మండలంలో రైతు వేదికలను ప్రారంభించిన అనంతరం జరిగిన సభలలో మంత్రి మాట్లాడారు.రాష్ట్రంలో80 శాతానికి పైగా ఉన్న రైతుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. మిషన్ కాకతీయ తో చెరువుల పూడికతీత తీయటం తో నేడు అవి జలకళ సంతరించుకున్నాయన్నారు.వాటి కింద సుమారు 30 లక్షల బోర్లలో నీరు వచ్చిందని,తద్వారా 50 లక్షల ఎకరాలలో పంట సాగు జరుగుతుందన్నారు.అతి తక్కువ కాలంలోనే ప్రపంచంలోనే అతి పెద్దది అయిన కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించి, 7 నుండి 8 ఉమ్మడి జిల్లాల ప్రజలకు సాగునీరు అందుతుందన్నారు.పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ తో మిగిలిన ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్ నగర్ తదితర జిల్లాల కు సాగునీరు వస్తుందని మంత్రి పేర్కొన్నారు. ప్రతి ఎకరాకు సాగునీటి ని అందించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు.రైతుల కోసం అతి తక్కువ కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా 2604 రైతు వేదికలు నిర్మించినట్లు మంత్రి పేర్కొన్నారు. ఒక్కో రైతు వేదికను 22 లక్షల తో క్లస్టర్ కు ఒకటి చొప్పున నిర్మించి,ఫర్నీచర్ కోసం అదనంగా లక్ష రూపాయలు మంజూరు చేశామన్నారు.ఈ వేదికల వద్ద ఏ ఈ ఓ లు అందుబాటులో ఉండి రైతన్నలకు సలహాలు,సూచనలు ఇస్తారని,శాస్త్రవేత్తల నుండి కూడా వివిధ సమస్యలకు పరిష్కారం పొందవచ్చన్నారు.ఇలాంటి రైతు వేదికలు దేశంలో ఎక్కడ లేవన్నారు.గతంలో 7 గంటల కరెంట్ కోసం నానా తిప్పలు పడే స్థాయి నుండి నేడు 24 గంటల ఉచిత విద్యుత్ తో రైతులు తమ వీలును బట్టి వ్యవసాయం చేసుకునేలా,అవకాశం వచ్చిందని మంత్రి పేర్కొన్నారు. ఉచిత విద్యుత్ కోసం ప్రభుత్వం 10 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని తెలిపారు. అటు చినుకులు పడుతుంటే ఇటు రైతుల అకౌంట్ లలో పంట పెట్టుబడి కింద డబ్బులు పడుతుంటాయని మంత్రి పేర్కొన్నారు. ప్రతి ఏటా 14,800 కోట్లు రైతు బంధు సహాయం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కు దక్కుతుందని మంత్రి అన్నారు.ఎలాంటి పైరవి లేకుండా,ఒక్క దరఖాస్తు లేకుండా,అందరికి ఈ సహాయం అందుతుందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 35 వేల కోట్లు రైతు బంధు కింద రైతన్నలకు సహాయంగా అందించటం జరిగిందన్నారు.కుటుంబ పెద్దగా ఉండే రైతు చనిపోతే 5 లక్షల రైతు భీమా అందిస్తున్నామన్నారు.దీని కోసం ప్రతి ఏటా 1200 కోట్లు రైతుల తరుపున భీమా కంపెనీలకు ప్రీమియం గా కడుతున్నట్లు మంత్రి తెలిపారు.సాధించుకున్న తెలంగాణ ను ప్రణాళిక బద్దంగా అభివృద్ధి చేస్తూ,దేశంలో నే అగ్రగామిగా నిలుపటానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు.తెలంగాణ లో అమలవుతున్న అనేక పథకాలు అటు కేంద్రం నుండి మొదలు పెడితే,పలు రాష్టాల వరకు అమలు చేస్తున్నాయన్నారు.50 వేల రూపాయల రుణమాఫీ కోసం ముఖ్యమంత్రి అదేశించారని,త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షల 50 వేల మంది రైతులకు లబ్ది చేకూరుతుందన్నారు.



తాండూరు కంది కి మంచి డిమాండ్ ఉండటంపై పలుమార్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రస్తావించారని,అన్నారు.మన పత్తికి కూడా మార్కెట్ లో మంచి డిమాండ్ ఉందన్నారు.అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళ లాగా తెలంగాణ ముందుకెళుతుందన్నారు.గొల్ల కురుమ యాదవ సోదరులకు గొర్రెల పంపిణీ, ముదిరాజ్ మత్స్యకారులకు చెరువుల్లో చేపలు వదలడం, వాటి అమ్మకం కోసం ఔట్ లెట్ కేంద్రాలు, మొబైల్ వాహనాలు, ప్రభుత్వం అందజేస్తుందన్నారు.అదేవిధంగా రజకులకు,నాయి బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు,దీని కోసం దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక అన్ని ప్రాంతాల అభివృద్ధి కి సమానంగా నిధులు ఇస్తున్నారని మంత్రి అన్నారు.పల్లె ప్రగతి ద్వారా ప్రతి నెల గ్రామాలకు నిధులు విడుదల చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కు దక్కుతుందన్నారు. మున్నూరు సోమారం గ్రామంలో రేషన్ కార్డులు మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా విద్యాధికారి రేణుక, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, ఎంపీపీ విజయ లక్ష్మీ హన్మంత్ రెడ్డి, జడ్పీటీసీ సుజాత వేణుగోపాల్ రెడ్డి, సొసైటీ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, మార్కెట్ చైర్మన్ రాములు, సర్పంచ్ లు,ఎంపీటీసీ లు,అధికారులు పాల్గొన్నారు.

# ఫ్యాన్స్ ని బ్యూటిఫుల్ రిక్వెస్ట్ అడిగిన మహేష్.!



మన దక్షిణాట ఉన్న సినిమా ఇండస్ట్రీ ప్రతీ దాంట్లో ఉన్న స్టార్ హీరోలను దైవం కన్నా ఎక్కువగా తమ అభిమానులు కొలుస్తారు అన్నది అందరికీ తెలుసు. అలాంటిది వారి అభిమాన హీరో బర్త్ డే వస్తుంది అంటే ఇక అక్కడ నుంచి వారి అభిమానులు చేసే హంగామా కూడా ఇంకో లెవెల్లో ఉంటుంది.కానీ ఆ అభిమానులను సరైన మార్గంలో నడిపించే హీరోకే మరింత గౌరవం కూడా దక్కుతుంది. మరి ఇప్పుడు మహేష్ కూడా అదే చేసారు. రానున్న ఆగష్టు 9న తన బర్త్ డే సందర్భంగా మహేష్ అభిమానులు భారీ ప్లానింగ్స్ వేసి పెట్టుకున్నారు. అయితే మరి ఆ స్పెషల్ డే కి తన పై ఉన్న ప్రేమను మరోరకంగా చూపించమని బ్యూటిఫుల్ మెసేజ్ అండ్ రిక్వెస్ట్ ని అడిగారు. “ప్రకృతిని పచ్చగా సమతుల్యంగా ఉంచాలన్నా కాలుష్యాన్ని తగ్గించాలన్నా విత్తనాలు నాటి మొక్కలను పెంచి సాధ్యం చెయ్యండి ఇలా మీరు నా మీద ఉన్న మీ ప్రేమను వ్యక్తపరచండి” అని మహేష్ తన అభిమానులకి ఈ విన్నపం అందించారు. ప్రస్తుతం మహేష్ నటిస్తున్న “సర్కారు వారి పాట” బ్లాస్టర్ అప్డేట్ కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# చిరంజీవి చెల్లెలుగా మహానటి ఫిక్స్..?





మెగాస్టార్ చిరంజీవి మలయాళ ‘లూసిఫర్’ తోపాటుగా తమిళ ‘వేదాళం’ చిత్రాన్ని కూడా రీమేక్ చేయనున్న సంగతి తెలిసిందే. మెహర్ రమేష్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కనుంది. ఇది సిస్టర్ సెంటిమెంట్ తో కూడిన కమర్షియల్ సినిమా. మెహర్ ఈ స్క్రిప్ట్ మీద దాదాపు మూడేళ్ళుగా వర్క్ చేసి చిరు ఇమేజ్ కు తగినట్లు కొన్ని మార్పులు చేర్పులు చేశారని తెలుస్తోంది. త్వరలోనే ఈ చిత్రాన్ని సెట్స్ మీదకు తీసుకెళ్లనున్నారు. అయితే ఈ చిత్రంలో చిరంజీవి చెల్లెలి పాత్రలో ఎవరు నటిస్తారనేది ఆసక్తికరంగా మారింది.‘వేదాళం’ రీమేక్ ప్రాజెక్ట్ గురించి క్లారిటీ వచ్చినప్పటి నుంచే ఇందులో చిరు సోదరి పాత్రలో నటించే హీరోయిన్ గురించి చర్చలు జరిగాయి. అందులోను సాయి పల్లవి - కీర్తి సురేష్ వంటి స్టార్ హీరోయిన్ల పేర్లు ప్రముఖంగా వినిపించాయి. కీర్తి సురేష్ అయితేనే మెగాస్టార్ సిస్టర్ రోల్ కి బాగుంటుందని భావించిన మెహర్ రమేష్.. ఏడెనిమిది నెలలుగా ఆమెను ఒప్పించడానికి ట్రై చేస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఈ క్రమంలో ఇప్పుడు ‘మహానటి’ హీరోయిన్ ని ఒప్పించగలిగారని ఫిలిం సర్కిల్స్ లో టాక్ వినిపిస్తోంది. దీని కోసం అమ్మడు భారీ రెమ్యూనరేషన్ అందుకోనుందని అంటున్నారు.‘వేదాళం’ ఒరిజినల్ వెర్షన్ లో అజిత్ కు జోడీగా శృతిహాసన్ నటిస్తే.. చెల్లెలుగా లక్ష్మీ మీనన్ కనిపించింది. ఇప్పుడు మెగా రీమేక్ లో లక్ష్మీ మీనన్ పాత్రలో కీర్తి కనిపించనుందని అంటున్నారు. ఇందులో నిజమెంతో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు ఆగాల్సిందే. కీర్తి సురేష్ ఇప్పటికే ‘అన్నాత్తే’ చిత్రంలో రజినీకాంత్ కూతురిగా నటిస్తోందని టాక్ ఉంది. ఇక తెలుగులో మహేష్ బాబు - పరశురామ్ పెట్లా కాంబోలో రూపొందుతున్న ‘సర్కారు వారి పాట’ చిత్రంలో కీర్తి హీరోయిన్ గా చేస్తోంది.ఇదిలా ఉంటే ‘ఆచార్య’ సినిమా టాకీ పార్ట్ షూటింగ్ పూర్తి చేసిన చిరంజీవి.. మోహన్ రాజా దర్శకత్వంలో ‘లూసిఫర్’ రీమేక్ కు మొదలు పెట్టడానికి సన్నాహాలు చూస్తున్నారు. ఇదే క్రమంలో నవంబర్ నుంచి ‘వేదాళం’ చిత్రాన్ని స్టార్ట్ చేసి రెండు రీమేక్ లను సమాంతరంగా షూట్ చేసే అవకాశాలు ఉన్నాయని టాక్. చిరు బర్త్ డే సందర్భంగా ఆగస్ట్ 22న దీనిపై ఓ క్లారిటీ రావొచ్చు. అలానే ‘ఆచార్య’ విడుదల తేదీ ప్రకటన కూడా ఉండొచ్చు.ఇకపోతే ‘శక్తి’ ‘షాడో’ వంటి డిజాస్టర్స్ తర్వాత చాలా గ్యాప్ తీసుకుని మెహర్ రమేష్ చేయబోయే చిరంజీవి సినిమాపై అందరి దృష్టి ఉంది. మరి మెగా రీమేక్ తో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టి మెహర్ ఫ్లాప్ దర్శకుడనే ముద్ర తొలగించుకుంటాడేమో చూడాలి.

# వెంకీ ఫస్టులుక్ తోనే పడగొట్టేశారట!



విజయ్ కి ఫైట్ మాస్టర్ గా మంచి పేరు ఉంది. సుదీర్ఘమైన తన ప్రయాణంలో చాలామంది స్టార్ హీరోల సినిమాలకు ఆయన పని చేశారు. ఇటీవల వచ్చిన ‘నారప్ప’ సినిమాలోని యాక్షన్ ఎపిసోడ్స్ ను కూడా ఆయనే కంపోజ్ చేశారు. తాజా ఇంటర్వ్యూలో ఆయన ‘నారప్ప’ సినిమాను గురించి మాట్లాడారు. “ఇది ‘అసురన్’ రీమేక్ అనే విషయం అందరికీ తెలిసిందే. నేను ‘అసురన్’ చూశాను. నాకు ధనుశ్ అంటే చాలా ఇష్టం .. ఆయన చాలా మంచి ఆర్టిస్ట్. ఈ సినిమాను వెంకటేశ్ గారితో రీమేక్ చేస్తున్నారని తెలిసినప్పుడు ఇది ఆయనకి సెట్ అవుతుందా? అనే ఒక డౌట్ వచ్చింది.అలాంటి సమయంలోనే ఈ సినిమాకి సంబంధించిన వెంకటేశ్ గారి లుక్ రిలీజ్ చేశారు. ఆ లుక్ చూడగానే ఆయన ఆ పాత్రను ఓన్ చేసుకున్నారనే విషయం నాకు అర్థమైపోయింది. ఫస్టు లుక్ తోనే ఆయన అందరినీ పడగొట్టేశారు. ఆయన తప్పకుండా ది బెస్ట్ ఇస్తారని అనుకున్నాను .. అదే జరిగింది కూడా. తమిళంలో కంటే వెంకటేశ్ గారు బెస్ట్ ఇచ్చారు .. అందులో డౌటేలేదు. ఈ సినిమాలో వెంకటేశ్ గారు ఓల్డ్ గెటప్ లోను .. యంగ్ లుక్ లోను కనిస్తారు. అక్కడ తేడా కొట్టకపోవడానికి కారణం వెంకటేశ్ గారికి గల అనుభవమే. ‘జయం మనదేరా’ వంటి సినిమాలో ఆయన ఆ తరహా పాత్రలను చేసి ఉన్నారు కాబట్టి తేలికగా మెప్పించగలిగారు.ఇక దర్శకుడిగా శ్రీకాంత్ అడ్డాల ఈ తరహా సినిమాను డీల్ చేయగలడా? అనే ఒక టెన్షన్ నాకు ఉండేది. కానీ ఆయనతో కలిసి మాట్లాడుతున్నప్పుడు .. చర్చలు జరుగుతున్నప్పుడు ఆయన చేసిన సూచనలు .. తీసుకున్న జాగ్రత్తలు చూసిన తరువాత నాకు నమ్మకం పెరుగుతూ వచ్చింది. సురేశ్ బాబు .. వెంకటేశ్ ఆయనని నమ్మి ఆయన చేతిలో ఈ ప్రాజెక్టును ఎందుకు పెట్టారనేది నాకు అర్థమైంది. ఆయన కనుకనే ఆ కథను అలా డీల్ చేయగలిగాడని నేను అనుకుంటున్నాను. కొన్ని చోట్ల ఆయన ఎమోషన్ తో కూడిన సున్నితమైన డైలాగ్స్ రాసుకున్నారు .. అవి చాలా బాగున్నాయి. కచ్చితంగా ఆయనకి హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే.ఈ సినిమాలో ‘బావి’ దగ్గర ఫైట్ సీన్ నాకు బాగా ఇష్టం. అక్కడ ప్రియమణి గారు అద్భుతంగా చేశారు. నిజంగా ఆమెది చాలా ఎక్సలెంట్ జాబ్. చిన్నపిల్లాడు కూడా బాగా కష్టపడ్డాడు. ప్రతి ఒక్కరూ కూడా చాలా అంకితభావంతో పనిచేశారు. అందరి టీమ్ వర్క్ కారణంగానే ఈ సినిమా ఇంతగా రీచ్ అయింది. ఈ సినిమా థియేటర్లకు వస్తే బాగుండేదని అందరికీ ఉంది. కానీ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల కారణంగా ఓటీటీ ద్వారా వచ్చింది. ఈ సినిమా ఇంత పెద్ద హిట్ అయినందుకు .. అటువంటి ఒక సినిమాలో నేను భాగస్వామిని అయినందుకు నాకు చాలా సంతోషంగా అనిపించింది” అని చెప్పుకొచ్చారు.

# నేను ఇండియన్ హీరోయిన్ లా ఉండాలనుకుంటున్నా



హాట్ బ్యూటీ పూజా హెగ్డే టాలీవుడ్ లో స్టార్ డమ్ దక్కించుకుని మెల్లగా ఇతర భాషల్లో కూడా ప్రస్తుతం బిజీ అవుతోంది. తెలుగు లోనే ఈమెకు మొదట కమర్షియల్ సక్సెస్ దక్కింది. అంతకు ముందు ఈమె హిందీలో నటించినా ఇతర భాషల్లో నటించినా కూడా సక్సెస్ లు దక్కింది లేదు. తెలుగు లో డీజే తో ఈమె కెరీర్ టర్న్ అయ్యింది. అప్పటి నుండి వరుసగా తెలుగు లో భారీ చిత్రాల్లో.. సూపర్ స్టార్ లకు జోడీగా నటిస్తూ దూసుకు పోతుంది. తెలుగు వచ్చిన స్టార్ డమ్ తో ఈమె ఇతర భాషల్లో కూడా ఆఫర్లు దక్కించుకుంటూ ఉంది. ప్రస్తుతం ఈమె తెలుగులో మాత్రమే కాకుండా తమిళం మరియు హిందీల్లో కూడా వరుసగా సినిమాలు చేస్తున్న విషయం తెల్సిందే.తాజాగా ఈమె ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించింది. తెలుగు ప్రేక్షకులు నన్ను వారి సొంత చేసుకున్నారు. తెలుగు లో నాకు వచ్చిన అవకాశాల పట్ల నేను చాలా సంతృప్తిగా ఉన్నాను. తెలుగులోనే కాకుండా నేను ఇతర భాషల్లో కూడా ప్రేక్షకులను ఎంటర్ టైన్ చేయాలని కోరుకుంటున్నాను. నేను ఒక భాష హీరోయిన్ గా కాకుండా ఇండియన్ హీరోయిన్ గా పేరు దక్కించుకోవాలని కోరుకుంటున్నాను. ప్రతి భాష ప్రేక్షకులు నన్ను చూడాలి.. నా సినిమాలను ఆధరించాలి అనేది నా కోరిక అంటూ చెప్పుకొచ్చింది. పాన్ ఇండియా సినిమాలను ఎక్కువగా చేస్తూ ఇండియన్ హీరోయిన్ పూజా హెగ్డే అనిపించుకోవాలనేది నా కోరిక అన్నట్లుగా పేర్కొంది.ఒక్క భాషకు పరిమితం అవ్వకూడదు అని ప్రతి ఒక్క హీరోయిన్ కూడా అనుకుంటారు. పూజా హెగ్డే కూడా అన్ని భాషల్లో నటించాలని అనుకోవడం సహజమైన విషయం. హీరోయిన్ గా ప్రస్తుతం పూజా హెగ్డే తెలుగు.. తమిళం.. హిందీ భాషల్లో నటిస్తోంది. ఈమె సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాలను దక్కించుకుంటున్నాయి. ప్రభాస్ తో ఈమె నటించిన రాధే శ్యామ్ తో పాన్ ఇండియా స్టార్ గా పూజా కు గుర్తింపు రావడం ఖాయం అన్నట్లుగా ఇండస్ట్రీ వర్గాల వారు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా విజయ్ తో చేస్తున్న తమిళ సినిమా.. హిందీలో సల్మాన్ చేయబోతున్న హిందీ సినిమా కూడా పూజా హెగ్డే ఆమె కోరికను తీర్చుతాయని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎంతో మంది హీరోయిన్స్ ఉన్నా ఇండియన్ హీరోయిన్స్ గా కొందరికి మాత్రమే గుర్తింపు దక్కుతుంది. ఇప్పుడు పూజా హెగ్డే కూడా ఇండియన్ హీరోయిన్ గా రాబోయే రోజుల్లో గుర్తింపు దక్కించుకుంటుందనే నమ్మకంను అభిమానులు వ్యక్తం చేస్తున్నారు.పూజా హెగ్డే తెలుగు లో చేసిన రాధే శ్యామ్ సినిమా సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుండగా మోస్ట్ ఎలిజబుల్ బ్యాచిలర్ సినిమా ను త్వరలోనే విడుదల చేయబోతున్నారు. ఆచార్య లో కూడా కీలక పాత్రలో ఈమె కనిపించింది. ఆ సినిమా కూడా త్వరలో విడుదల అవ్వబోతుంది. ఇంకా పలు సినిమాలు కూడా చర్చల దశలో ఉన్నాయి. మొత్తానికి పూజా హెగ్డే సౌత్ తో పాటు అన్ని భాషల్లో కూడా బిజీ హీరోయిన్ గా దూసుకు పోతుంది.


## పూలే - అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS)

అంబేడ్కర్ రాజనీతి మూవ్‌మెంట్ (ARM)
(A Unit of JAC Regn. No. 1047 of 2016)
Central Office: # 6-2-29/3/12, 3rd Floor, Doublat Plaza, Lakdi-Ka-Pool, Hyderabad - 500 004
https://ambedkarrajaneethi.com E-mail : ambedkarrajaneethimovement@gmail.com

**ఆత్మ గౌరవ పరిరక్షణే మన లక్ష్యం - రండి కదలిరండి**

బహుజన మిత్రులారా !
జై భీమ్

భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 74 సంవత్సరాలు అయినప్పటికీ 85% బహుజనుల సమస్యలు సమస్యలుగానే ఉంటున్నాయి.

అత్యధిక జనాభా కలిగి ఉన్న బహుజనులు కూడా, బహుజన సమస్యలను మెమోరాండం ద్వారానే ప్రభుత్వాలను అడుక్కుంటునారు. సమస్యలు అర్థం కాని అల్పసంఖ్యాక ఆధిపత్యకులాలు ఈ దేశాన్ని ఏలుతున్నారు. మన దేశాభివృద్ధి జరగాలంటే సమస్యలకు పరిష్కారం తెలిసిన బహుజనులు, పూలే పోరాట పటిమతో బాబాసాహెబ్ డా॥ అంబేడ్కర్‌గారు రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులతో ఒకరి సమస్యను ఒకరు సమర్థించు కుంటూ చేయి చేయి కలిపి ముందుకు సాధిద్దాం. బహుజన కులాల మధ్య అంతరాలను తొలగించి సభ్యత్వాలను పెంపొందిస్తూ బహుజనుల ఆత్మ గౌరవాన్ని కాపాడుకొందాం.

సమ సమాజ స్థాపనకు ఈ సామాజిక ఉద్యమంలో లక్షలాది మంది మెంబర్స్‌గా చేరడం వల్ల మన సమస్యలను మనమే పరిష్కరించుకోవడమే కాకుండా బహుజన రాజ్యాధికారం వైపు నడిపించగలము.

**ప్రధాన ఆశయాలు**

**సమసమాజ స్థాపనకు ఫూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి (PARS) అశయాల పట్ల అవగహన కల్పించడానికి రండి కదలి రండి.**

1. బహుజన సమస్యలను సంవత్సరాల తరబడి పరిష్కారం కాకుండా పేద వాడిని ఇంకా పేదవాడుగా.... గుడిసెలను ఇంకా పూరిగుడిసెలుగా... మురికి వాడలను ఇంకా మురికి కుపాలుగా చేస్తూ.. అల్ప సంఖ్యాక ఆధిపత్య కులాలు పరిపాలిస్తున్నారు. అందువల్ల దేశాభివృద్ధి కావాలంటే సమస్యలను పరిష్కరించే సత్తా ఉన్న అత్యధిక జనాభా కలిగిన బీసీలను ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలనేది ప్రతిపాదన.
2. మహిళలను అబలలుగా ఈ సమాజం చిత్రీకరిస్తుంది. కాబట్టి అబల కాదు సబల అని నిరూపించడానికి అన్ని రంగాల్లో మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదిస్తుంది.
3. ఏ కులం సమస్యలు ఆ కులం వారికే తెలుస్తాయి. కానీ 40 లక్షల జనాభా ఉన్న కులాలు ఇంకా అసెంబ్లి మెట్లు ఎక్కలేదు. కాబట్టి 5 లక్షల జనాభా ఉన్న ప్రతి కులం నుండి నాయకులను అసెంబ్లీకి ఎమ్మెల్యేలుగా పంపాలని ప్రతిపాదన.
4. రిజర్వేషన్ల వల్ల రాష్ట్రం నాశనం అవుతుందని కొంతమంది అల్ప సంఖ్యాకులయిన పాలక కులాల వారు బాధపడుతున్నారు. అందువల్ల భారత రత్న బాబా సాహెబ్ డా॥ బి.ఆర్. అంబేడ్కర్ గారు భారత రాజ్యంగ పీఠికలో ప్రతిపాదించిన సమానత్వ సిద్ధాంతం ప్రకారం రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తూ మీరెంతో మీకంత (మీ జనాభా ఎంతో మీకంత రిజర్వేషన్) అని ప్రతిపాదిస్తుంది.
5. డా॥ బి.ఆర్. అంబేడ్కర్ గారు ప్రతిపాదించిన విధంగా ముస్లిం, క్రిస్టియన్, ఎస్సీ, ఎస్టీ, బుద్దిస్టులకు సేపరేట్ ఎలక్టోరేట్ (ప్రత్యేక నియోజక వర్గాలు) అవసరమని ప్రతిపాదిస్తుంది.
6. సమతా కులం : కులాంతర వివాహం చేసుకున్న వారి యొక్క పిల్లలకు సమతా కులంగా నామకరణం చేస్తే ప్రభుత్వం అంగీకరించాలి. ఆ నవ తరానికి ఆర్థిక, రాజకీయ, ఉద్యోగ, విద్యా రంగాలలో ప్రాముఖ్యత ఇవ్వాలి మరియు వారి తల్లిదండ్రులకు ప్రాముఖ్యతతో కూడిన రక్షణ కల్పించాలి. తద్వారా 150 సంవత్సాలలో అంబేడ్కర్ కోరుకున్న కుల రహిత సమాజాన్ని చూడవచ్చు.

ఈ ప్రతిపాదనలలో ఏ ఒక్క ప్రతిపాదనను అంగీకరించినా... వారు ప్రతి ఒక్కరూ వారి వారి కుటుంబ సభ్యులతో సహా www.ambedkarrajaneethi.com వెబ్సైట్ ద్వారా సభ్యులుగా చేరి ఆశయ సాధనకు మద్దతు తెలిపి, బహుజన ఆత్మగౌరవాన్ని పరిరక్షించు కునేందుకు రండి.. కదలి రండి...

**కమిటీల నిర్మాణం**

రెండు తెలుగు రాష్ట్రాలలో రాష్ట్ర, జోనల్, పార్లమెంట్, అసెంబ్లీ, మండల స్థాయిలలో కమిటీల నిర్మాణం జరుగుతుంది.
ప్రతి కమిటీలో కనీసం 21 మంది లేదా అంతకంటే ఎక్కువమంది సభ్యులుగా ఉంటారు.
అదేవిధంగా ప్రతి కమిటీలో కనీసం 7 కులాలనుండి లేదా అంతకంటే ఎక్కువ కులాల నుండి ప్రాతినిధ్యం కలిగివుంటుంది

Page No. 2

ఆశయాలు

**ఆత్మ గౌరవ పరిరక్షణే మన లక్ష్యం - రండి కదలిరండి**

1. చట్టపరమైన రిజర్వేషన్స్ అమలుకు నోడల్ మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయుట.
2. ప్రైవేట్ రంగంలో నడిచే అన్ని సంస్థలలో రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయుట, వాటి వివరాలను సంస్థ నోటీస్ బోర్డులలో పెట్టి సమాచార హక్కు చట్టం (RTI ACT) పరిధిలో ఉంచుట.
3. నిరుద్యోగ నిర్మూలన కొరకు 7వ తరగతి నుండి పిజి చేసిన ప్రతి నిరుద్యోగులకు వారికి ఇష్టమైన ఉద్యోగ, వ్యాపార రంగాలలో స్టైఫండ్‌తో కూడిన శిక్షణ అవకాశాలను కల్పించుట.
4. అన్ని ప్రభుత్వ పాఠశాలలను, రెసిడెన్షియల్ స్కూల్స్‌గా మార్చి, అందరికి ఉచిత నిర్బంద విద్యను అందించుట.
5. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరను ముందుగానే ప్రకటిస్తూ, విపత్కర పరిస్థితుల్లో కౌలు రైతు /రైతుకు నష్టపరిహారం చెల్లించుట.
6. భూమి లేని రైతులందరికి నాలుగు ఎకరాల భూమి ఇచ్చుట
7. భారతదేశ ఆర్థిక అభివృద్ధిలో ప్రతిపౌరుడిని భాగస్వామిగా చేస్తూ దేశం వదిలి పారిపోని బహుజనులకు వారి వ్యాపార వ్యవసాయ రంగాలకు గాను రూ. 2,00,000/- (అక్షరాలా రెండు లక్షల రూపాయలను) హామి లేని ఋణాన్ని కేవలం ఆధార్ కార్డు ఆధారంగానే ఇచ్చి,
8. రాష్ట్ర ముఖ్యమంత్రి నుండి చిరు ఉద్యోగి వరకు అందరూ విధిగా ప్రభుత్వా ఆసుపత్రిలోనే చికిత్స చేయించుకొనుట.
9. ప్రతి పూరిగుడిసెను విశాలమైన వీదులలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పక్కా గృహాలను నిర్మించుట.
10. అన్ని సమస్యలకు మూలకారణం అయిన “మద్యపానాన్ని” పూర్తిగా నిషేదించుట.
11. మతం మారినా కులం మరాదు కాబట్టి రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను ఎస్సీలకు వర్తింపచేయుట.
12. కార్మికులకు, కర్షకులకు, వలస కూలీలకు, వ్యవసాయ కూలీలకు, రూ. 50,00,000/- విధిగా జీవిత భీమాను కల్పించుట.
13. కుటీర పరిశ్రమలను పెట్టాలనే ఆసక్తివున్నవారికి మౌళిక వసతులు కల్పించి, వాటిని అద్దెకిచ్చి వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించుట.
14. భూమిలేని ముస్లింలకు, కిష్టియన్‌లకు మరియు హిందువులకు ఆయా సంస్థల ఆధీనంలో గల భూములను పంచుట.
15. దేవాదాయ భూములను, భూమిలేని పేద రైతులకు కౌలుకు ఇచ్చుట.
16. రాష్ట్ర పోలీస్ వ్యవస్థను ఒక ప్రత్యేక సంస్థగా రూపొందించుట.
17. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తెచ్చి నమోదైన ప్రతి ఒక ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా కు చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా ప్రపోర్షనేట్‌గా ప్రభుత్వ అడ్వర్టైజ్‌మెంట్స్‌ను ఇచ్చి ప్రోత్సాహించుట.
18. రాజకీయ, వ్యాపార, ఉద్యోగ రంగాలలో లంచం ఇచ్చే అవినీతి పరులను పాము కంటే విషపూరితమైన వ్యక్తిగా భావించుట.
19. ఎన్నికల్లో డబ్బులు వంచే వ్యక్తులను, ఆయా కుటుంబాలను ఎన్నికల్లో పోటి చేయకుండా, పోటీకి అనర్హులుగా ప్రకటించుట. రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ రద్దు చేయుట.

**అసక్తి ఉన్నవారు సంప్రదించగలరు**

Central Working Committee Members :

జె.బి. రాజు బహుజన IIS-vrs
డా॥ గూడూరు సీతామహాలక్ష్మీ
ఆరెపల్లి రాజేందర్
డా॥ పి. పరమ శివన్
Sn. ప్రొ॥ ఆర్. శ్యామ్ సుందర్
నేరెళ్ళ కోటేశ్వరరావు
Sn. ప్రొ॥ డా॥ ఎన్. వెంకటేశ్వర్లు
డా॥ పెద్దపల్లి అప్పారావు
నిశాంత్ బహుజన
ఆల్‌మెన్ రాజు
గుంజ నరసింహా రావు
ఉప్పు సత్యనారాయణ
యం. పద్మ శర్మ
దూలపల్లి వాణి
జి. గంగయ్య
దాసరి జాన్
నాగుల శ్రీనివాస్ యాదవ్
డి. దేవాదాస్
కొలా జనార్ధన్
సమ్మి అప్పారావు
అమిరిశెట్టి శ్రీధర్
అయినవిల్లి వివిఎస్ నారాయణ
పుట్టపల్లి కబీర్ మేరీ హెల్దెన్
డా॥ పెద్దపల్లి అప్పారావు
డి. గోవర్ధన్

నేషనల్ కన్వీనర్: Sn డా॥ కె. శివ భాగ్యారావు బహుజన IRS-vrs
Former Deputy Commissioner of Income Tax

జై భీమ్... జై పూలే... జై భారత్

RSVP : 9640134556


Printed, Published & Owned by : Sajja Dhananjaya Sarath, Printed at : Apsara Printing Works, 3-2-814, Near Manjeera Lodge, Chappal Bazar, Hyderabad - 27, Published at : 6-2-29/3/13, 3rd Floor (Part ‘A’), Doulat Plaza, Lakdikapul, Khairatabad Main Road, Hyderabad - 4. Editor : Sajja Dhananjaya Sarath, RNI: TELTEL / 2017 / 73383, email:editor.prajapalana@gmail.com,prajapalana2017@gmail.com Phone:040-23233989